**నీలగిరి ఎక్స్‌ప్రెస్**
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

### నీలగిరి నిత్యపద్యం
**ఆటవెలది**

వేడుకగను లేచు వేకువజామున
నిద్రలేపునంట నిత్యమున్న
బంధుమిత్రు రాక బహుముచ్చటగ జెప్పు
కాలజ్ఞానియంట కాకి మనకు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

### విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 159 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 6-9-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00



# తెలంగాణకు నూతన విద్యావిధానం కావాలి

**ప్రపంచ దేశాలతో విద్యలో తెలంగాణ పోటీ పడాలి**



- ఎన్నో సంస్కరణలు తీసుకుని రావాలి
- కేజ్రీవాల్ సంస్కరణ వల్లనే మూడోమారు సీఎం అయ్యారు
- తను అలాగే కావాలని కోరుకుంటున్నా
- గత పాలకులు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారు
- గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్


**హైదరాబాద్,**
తెలంగాణకు నూతన విద్యా విధానం కావాలని,రావాల్సిన అసవరం ఉందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతిసమస్యను పరిష్కరిస్తున్నానని చెప్పారు. విద్యాశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరముందని అన్నారు. విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వంలో నూతన నియామకాలు లేవని ఆరోపించారు. గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ మూతపడే పరిస్థితికి వచ్చిందన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళావేదికలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం -మిగతా 2 లో





# దేశంలో భారీ ఉగ్రకుట్రకు ప్లాన్..

- కోటి మంది లక్ష్యం..
- పోలీసులు హై అలర్ట్

**న్యూఢిల్లీ,**
దేశ ఆర్థిక రాజధాని ముంబై కి ఉగ్ర బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. ముంబై ట్రాఫిక్ పోలీసులకు ఫోన్ చేసిన ఓ వ్యక్తి.. నగరంలో మానవబాంబులతో దాడికి ప్లాన్ చేసినట్లు బెదిరించారు. కోటి మంది లక్ష్యంగా ఈ దాడి జరుగుతుందని.. నగరం మొత్తం దద్ధరిల్లుతుందంటూ హెచ్చరించారు. ఈ బెదిరింపు కాల్‌తో అప్రమత్తమైన ముంబై పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబై ట్రాఫిక్ పోలీసు హెల్ప్ లైన్ నంబర్‌కు ఈ బెదిరింపు కాల్ వచ్చింది. నగరం మొత్తం దద్ధరిల్లేలా -మిగతా 2 లో






# జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్‌లను తీసుకు రాలేం

- ఏకరూప పన్ను విధానం మనదేశంలో అసాధ్యం
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

**న్యూఢిల్లీ,,సెప్టెంబర్ 05(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితమైనదని, ఇలాంటి సమయంలో ఒకే పన్ను విధానాన్ని తీసుకురావడం అసాధ్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్వరూపంలో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణలపై ఆమె మాట్లాడారు.తమ ప్రభుత్వానికి పౌరుల అవసరాలే ప్రథమ ప్రాధాన్యమని, ఆ తర్వాతే ఆదాయం గురించి ఆలోచిస్తామని పేర్కొన్నారు. టారిఫ్‌ల వల్ల ఎగుమతిదారులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారంపైనా కేంద్రం దృష్టిపెట్టినట్లు- తెలిపారు. ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని మరోసారి స్పష్టం చేశారు. సామాన్యులపై పన్ను భారం తగ్గించేందుకే జీఎస్టీ విధానంలో ఈ సవరణలు చేసినట్లు తెలిపారు. జాతీయ మీడియా సంస్థ 'ఇండియాటు-డే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మల ఈ వ్యాఖ్యలు చేశారు. వన్ నేషన్-వన్ ట్యాక్స్ మంచి ఆలోచనే కానీ.. -మిగతా 2 లో

# నేటి నిమజ్జనానికి భారీగా ఏర్పాటు

**ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భారీగా బందోబస్తు**



- ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భారీగా బందోబస్తు
- విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు
- ఉదయం ఆరు నుంచి నిమజ్జనం ప్రారంభం
- ప్రధాన రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగింపు
- చివరి రోజు ఖైరతాబాద్‌కు పోటెత్తిన జనం

**హైదరాబాద్,**
వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టారు. ట్యాంబండ్ పరిసరాల్లో క్రేన్లు సిద్దంగా ఉన్నాయి. పోలీసులు బందోబస్తు కోసం రంగంలోకి దిగారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు హైదరాబాద్‌లో నిమజ్జన కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. నగరవాసులు.. పోలీసులకు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. నిమజ్జనం కోసం 10 బేబీ పాండ్లు, 8 పోర్టబుల్ వాటర్ ట్యాంక్‌లు, 8 ఎక్స్కవేషన్ పాండ్లను ప్రభుత్వం ఏర్పాటు- చేసింది. -మిగతా 2 లో



# ఖైరతాబాద్ గణపతికి రేవంత్ ప్రత్యేక పూజలు


**71 ఏళ్లుగా ఉత్సవాల నిర్వహణపై అభినందనలు**

**హైదరాబాద్,సెప్టెంబర్ 05(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఖైరతాబాద్ మహాగణపతిని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారికి సీఎం ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 71ఏళ్ల క్రితం గణేశ్ ఉత్సవ సమితి ఒకే ఒక్క అడుగు గణేశుడిని ప్రతిష్ఠించుకుని ఉత్సవాలను ప్రారంభించింది. దేశంలోనే గణేశ్ ఉత్సవాలకు ఖైరతాబాద్ ప్రసిద్ధి చెందింది. ఒక్కసారి నిర్వహణే కష్టమైన ఈరోజుల్లో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టు-కుంటూ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి ఉత్సవాలను కొనసాగిస్తోంది. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా, ఇప్పుడు సీఎంగా ఈ ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించింది. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఎక్కడా సమస్యలు లేకుండా ఉత్సవాలను పూర్తిచేసుకున్నాం. ఉత్సవాలను విజయవంతంగా -మిగతా 2 లో

# చైనా చీకట్లలోకి భారత్, రష్యా..

- చైనాను నియంత్రించాలంటే భారత్ తమకు సరైన భాగస్వామి
- ఆ మూడు దేశాలు కలిసిమెలిసి కలకాలం వర్ధిల్లాలని కోరుకుంటున్నా'
- ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్టు..!

**న్యూఢిల్లీ,**
భారత్ , రష్యా దేశాలకు తాము దూరమైనట్లు అనిపిస్తోందని, వక్రబుద్ధి కలిగిన చైనా చీకట్లలోకి ఆ రెండు దేశాలు వెళ్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఆ మూడు దేశాలు వర్ధిల్లాలని తాను కోరుకుంటున్నానని ఎత్తిపొడుపు కామెంట్ చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ లో ఒక పోస్టు పెట్టారు.భారత ప్రధాని నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల చైనాలోని తియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో వేదిక పంచుకున్నారు.



ఈ సందర్భంగా భారత్-రష్యా, భారత్-చైనా, రష్యా-చైనా దేశాల మధ్య ద్వైపాక్షిక సమావేశాలు జరిగాయి. ఆయా దేశాల ద్వైపాక్షిక అంశాలపై ఆ సమావేశాల్లో చర్చించారు. ఈ మూడు దేశాల మధ్య జరుగుతున్న -మిగతా 2 లో



# అడ్డదిడ్డంగా కరెంటు తీగలు..

**అధ్వానంగా విద్యుత్ స్తంభాలు**



తీగలా.. యమ పాశాలా..?

- తీగలా.. యమ పాశాలా..?
- ఇండ్లపైనే విద్యుత్ తీగలు.. గృహాల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు
- లైన్ల పునరుద్ధరణకు ఏటా రూ.100 కోట్లు ఖర్చు
- అయినా మెరుగుపడని విద్యుత్ పంపిణీ వ్యవస్థ
- తరచూ తెగిపడుతున్న వైర్లు.. ప్రమాదాల బారిన సిటీజన్లు
- బాధ్యులపై చర్యలు శూన్యం
- వరుస ప్రమాదాలతో డిస్కం హడావుడి.. తర్వాత మామూలే
- "నీలగిరి ఎక్స్ ప్రెస్ " ఎక్స్ క్లూజివ్

**హైదరాబాద్,సెప్టెంబర్ 05(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
విద్యుత్ లైన్లు నగరవాసుల జీవితాల్లో చీకట్లను మిగుల్చుతున్నాయి. నెత్తిన మృత్యుపాశాల్లా వేలాడుతున్న వైర్లు ఎప్పుడు.. ఎవరిపై తెగిపడతాయో తెలియని విధంగా పరిస్థితి ఉంది. విద్యుత్ లైన్ల నిర్వహణకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఏటా రూ.వంద కోట్ల వరకు ఖర్చు చేస్తున్నా.. ప్రమాదాలు తగ్గకపోగా మరింత పెరుగుతుండటం గమనార్హం. ఘటన జరిగినప్పుడు డిస్కం హడావుడి చేసి తర్వాత చేతులు దులుపుకుంటోంది తప్పితే తగిన పాఠాలు నేర్వడం లేదు. నివారణకు దిద్దుబాటు చర్యలూ చేపట్టడం లేదు. తాజాగా మంగళవారం నాచారంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం విరిగి మీద పడటంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందాడు.

**- విద్యుత్ తీగలు.. ప్రాణ సంకటం**
హైదరాబాద్ మహానగరంలో విద్యుత్ తీగలు ప్రాణ సంకటంగా మారాయి. వరుసగా జరుగుతున్న ప్రమాదాలు నగరవాసుల్ని భయాందోళనకు గురి చేస్తున్నాయి. విద్యుత్ తీగలు తెగడం, తక్కువ ఎత్తులో ఉన్న తీగలు, నిర్వహణ నిర్లక్ష్యం, జంక్షన్ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో అమాయకులు ప్రాణం కోల్పోతున్నారు. గతంలో ఒకరిద్దరు చనిపోయిన ఘటనలు ఉండగా.. ఈ ఏడాది రెండు, మూడు భయంకర ఘటనలు జరిగాయి. సాగర్ రింగ్ రోడ్డుకు వెళ్లే దారిలో చింతలకుంట సమీపంలో 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడి ఇద్దరు సజీవ -మిగతా 10 లో

# బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం

- కామారెడ్డి సభకు భారీగా ఏర్పాట్లు
- ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంతే సీఎం
- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్,సెప్టెంబర్ 05(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నట్లు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కార్యకర్తలను కూడా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కామారెడ్డిలో బహిరంగ సభ ఏర్పాటుకు సీఎం ఆదేశాలతో సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ముందుకు వెళ్తాం. ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్‌రెడ్డే మళ్లీ సీఎం అవుతారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకొని వెళ్తున్నాం. క్రమశిక్షణ విషయంలోనూ ఎక్కడా రాజీపడటం లేదు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలి. సీబీఐలో కొంత లొసుగులు ఉన్నాయి. అది వాస్తవం అని మహేశ్‌కుమార్ గౌడ్ -మిగతా 2 లో



## దేశంలో భారీ ఉగ్రకుట్రకు ప్లాన్..

(మొదటి తరువాయి)

34 వాహనాల్లో 400 కిలోల RDX పేలుడు పదార్థాలను సిద్ధం చేసినట్లు బెదిరించారు. అనంత చతుర్దశి సందర్భంగా దాదాపు కోటి మందిని చంపేస్తామంటూ హెచ్చరించారు. ఈ ఉగ్ర బెదిరింపులతో ముంబై పోలీసులు హై అలర్ట్ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా భద్రతను పెంచినట్లు ముంబై పోలీసులు తెలిపారు. లష్కరే జిహాదీ అనే సంస్థ నుంచి ఈ బెదిరింపులు వచ్చినట్లు వెల్లడించారు.

## జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్,డీజిల్‌లను తీసుకు రాలేం

(మొదటి తరువాయి)

ఆచరణలో అది సాధ్యం కాదు. అభివృద్ధిలో వైవిధ్యాలు ఉన్నప్పుడు ఏకరూప జీఎస్టీ రేటును అమలు చేయడం అన్యాయమవుతుంది. మెర్సిడెస్ బెంజ్ కారు, హవాయి చెప్పులకు ఒకే పన్ను రేటు- విధించగలమా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితంగా ఉంది. అభివృద్ధి చెందిన రంగాలు అధిక పన్నులను కట్టగలుగుతాయి. అభివృద్ధి చెందని రంగాలకు అది భారమవుతుంది. ఒకవేళ భారత్ అన్ని రంగాల్లో సంపూర్ణంగా అభివృద్ధి చెందితే అప్పుడు ఒకే పన్ను విధానం సాధ్యమవుతుందని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ సందర్భంగా విపక్ష కాంగ్రెస్ పార్టీపై ఆర్థిక మంత్రి విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అంటూ ఎగతాళి చేసిన వారే.. ఇప్పుడు పన్ను సంస్కరణలు చేయగానే క్రెడిట్ తీసుకునేందుకు ఆరాటపడుతున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 91శాతం వరకు ఆదాయపు పన్ను విధించిన రోజులు ఉన్నాయని దుయ్యబట్టారు. జీఎస్టీలో సంస్కరణ వల్ల రాష్ట్రాలతో పాటు- కేంద్రానికి కూడా ఆదాయంలో కొంత కోత ఉంటుందని నిర్మలాసీతారామన్ తెలిపారు.

## ఖైరతాబాద్ గణపతికి రేవంత్ ప్రత్యేక పూజలు

(మొదటి తరువాయి)

ముగించిన గణేశ్ ఉత్సవ సమితి సభ్యులను అభినందిస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉత్సవ సమితికి అన్ని విధాలుగా సహకారం అందిస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ మహా గణపతి శనివారం గంగమ్మ ఒడికి చేరనున్నాడు. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఖైరతాబాద్ వినాయకుడ్ని దర్శించుకున్నారు. బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. ఎన్ని కష్టాలు వచ్చినా.. నష్టాలు వచ్చినా అన్నింటిని భరించుకుంటూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఉత్సవాలను నిర్వహించినందుకు ఉత్సవ కమిటీలోని ప్రతీ ఒక్కరిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. దేశంలో ఎక్కడా లేని విధంగా గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను నిర్వహించుకున్నాం. మహా గణపతి నిమజ్జనానికి ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు- పూర్తి చేశాము. మత సామరస్యానికి హైదరాబాద్ నగరం గొప్ప ఉదాహరణ. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు తెలంగాణకి మంచి పేరు తెచ్చి పెట్టాయని అన్నారు.

## చైనా చీకట్లలోకి భారత్, రష్యా..

(మొదటి తరువాయి)

పరిణామాలు ట్రంప్‌కు కంటగింపుగా మారాయి. అందుకు ఈ మూడు దేశాలను ఎత్తిపొడుస్తూ ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'భారత్, రష్యా దేశాలను తాము వక్రబుద్ధి కలిగిన చైనాకు కోల్పోతున్నట్లు అనిపిస్తోంది. చైనా చీకటి వలయంలోకి ఆ దేశాలు వెళ్తున్నాయి. ఆ మూడు దేశాలు కలిసిమెలిసి కలకాలం వర్ధిల్లాలని కోరుకుంటున్నా' అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా చైనాను నియంత్రించాలంటే భారత్ తమకు సరైన భాగస్వామి అని అమెరికా మొదటి నుంచి భావిస్తూ వస్తోంది. అందుకే రిపబ్లికన్‌లు, డెమోక్రాట్‌లు అన్న తేడా లేకుండా ఎవరు అమెరికా అధ్యక్షులైనా భారత్‌తో మైత్రి బంధాన్ని కొనసాగిస్తూ వచ్చారు. ఆఖరికి డొనాల్డ్ ట్రంప్ కూడా తొలిసారి అధ్యక్షుడు అయినప్పుడు భారత్‌తో మంచి సంబంధాలనే కొనసాగించారు. కానీ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

## బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం

(మొదటి తరువాయి)

అన్నారు.ఈ నెల 15 వ తేదీకి పిసిసి పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తి అయిందని, క్రమశిక్షణ విషయంలో కూడా ఎక్కడా రాజీపడలేదని తెలియజేశారు.బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నామని, కార్యకర్తలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. సిబిఐలో కొంత లొసుగులు ఉన్నాయని అది వాస్తవం అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముందుకు వెళతామని, ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్ రెడ్డే మళ్లీ సిఎం అవుతారని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## ఆరుగురు తెలుగువారికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

### రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం



**న్యూఢిల్లీ -,సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వినూత్న పద్దతిలో బోధనతో విద్యార్థులకు సులభతరంగా పాఠాలు చెప్పడంతో పాటు వారిలో చదువుపై మక్కువ పెంచుతున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు దక్కాయి. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులు ఈ పురస్కారాలు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పాఠశాల విద్యా విభాగంలో విశాఖపట్నంలోని పండిట్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (17వ వార్డు) ఉపాధ్యాయురాలు మాధబత్తుల తిరుమల శ్రీదేవి, ఉన్నత విద్యా విభాగంలో ప్రొఫెసర్ జె విజయలక్ష్మి (స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ), మెండ దేవానంద కుమార్ (లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మైలవరం) పురస్కారాలు అందుకున్నారు. తెలంగాణ నుంచి కూడా ముగుర్గు ఉపాధ్యాయులకు పురస్కారాలు లభించాయి. దేశవ్యాప్తంగా పాఠశాల విద్యా విభాగంలో 45 మందికి, ఉన్నత విద్యా విభాగంలో 21 మంది ఉపాధ్యాయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యయ పురస్కారాలను రాష్ట్రపతి అందజేశారు.

## తెలంగాణకు నూతన విద్యావిధానం కావాలి

(మొదటి తరువాయి)

రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలతో విద్యలో తెలంగాణ పోటీపడాలని సీఎం అన్నారు. తెలంగాణకు ఎడ్యుకేషన్ పాలసి కావాలని స్పష్టం చేశారు. ఆ పాలసీ పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని సూచించారు. ఢిల్లీ మాజీ సీఎం కేజీవ్రాల్ మూడో సారి సీఎం కావడానికి కారణం విద్యా రంగంలో ఆయన తెచ్చిన మార్పులే అని గుర్తు చేశారు. తాను కూడా అలా కావాలని అనుకుంటున్నట్లు- సీఎం చెప్పారు. తనకు కూడా రెండో సారి, మూడో సారి సీఎం కావాలని ఉంటుంది అన్నారు. తాను ఫార్మ్ హౌస్‌లో పడుకుని మిమ్మల్ని పని చేయమని చెప్పానని, డీజిల్ మెకానిక్ నేర్చుకుంటే ఉపయోగం ఏంటని, బెంజ్ కార్ల కాలంలో అని సీఎం ప్రశ్నించారు. అంబాసడర్ కారు కావాలంటే ఫార్మ్ హౌస్‌కు వెళ్ళాలని అన్నారు. విద్యార్థుల జీవితాల్లో మార్పులు తీసుకురావాలని యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు- చేశామన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ బారిన పడుతున్నారు. డ్రగ్స్ మహమ్మారి తాలూకా స్థాయికి చేరిందని అన్నారు. దీనిని అరికట్టడానికి ఈగల్ ఫోర్స్ ఏర్పాటు- చేశామని చెప్పారు. అందరం కలసి అద్భుతమైన తెలంగాణను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. కేజీ టు- పీజీ అంటే గతంలో ఉన్న ప్రభుత్వానికి మీరు సంపూర్ణ మద్దతు అందించారు. కేజీ 2 పీజీ ఉచిత నిర్బంద విద్య అందిందా అని సీఎం ప్రశ్నించారు. మారుమూల ప్రాంతాల్లో స్కూల్స్ మూత పడ్డాయో లేదో ఆలోచించాలని అన్నారు. తెలంగాణ నినాదాన్ని, ఉద్యమాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లింది టీచర్‌లని గుర్తు చేశారు. తెలంగాణ సాధనలో క్రియాశీలకంగా వ్యవహరించిన టీచర్‌లు గత పదేళ్లలో ఎన్ని సమస్యలను పరిష్కరించుకున్నారని సీఎం ప్రశ్నించారు. గత పాలకులకు ఉపాధ్యాయుల సమస్యలను ప్రరిష్కరించాలనే ఆలోచన రాలేదు... తమ ప్రభుత్వం వచ్చాకే వారి సమస్యలు పరిష్కారం అయ్యాయని చెప్పారు. ప్రజా ప్రతినిధుల ప్రైవేట్ వర్సిటీ-లు పెట్టు-కొని వ్యాపారం చేశారని, ప్రభుత్వ వర్సిటీల్లో గత ప్రభుత్వం నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. ఓయూ మూత పడే పరిస్థితికి వచ్చిందని అన్నారు.గురుపూజోత్సవ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు బోధిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల కంటే నాణ్యమైన విద్య అందిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ఏటా 200 మంది టీచర్లను విదేశాలకు పంపి.. అక్కడి విద్యా విధానం అధ్యయనం చేసేలా ప్రోత్సహిస్తాం. దిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి సీఎం కావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణం. నాకూ స్వార్థం ఉంది. టీ-చర్లు బాగా పని చేస్తే నేనూ రెండోసారి సీఎం అవ్వాలనుకుంటు-న్నా. మీతోపాటే నేనూ కష్టపడతా. నేను ఫామ్ హౌస్‌లో పడుకుంటా.. మళ్లీ సీఎంను చేయండి అని అనట్లేదు. విద్యాభివృద్ధి కోసం టీచర్లు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా. ఐటీఐలు అప్‌డేట్ చేసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా మార్చాం. ఏటీసీలో టాటా కంపెనీ కల్పించిన సదుపాయాలు చూస్తే నాకే మతిపోయింది. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారత్.. ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణం సాధించలేదు. దక్షిణ కొరియాలో ఒక్క యూనివర్సిటీకి చెందిన వారే 16 స్వర్ణపతకాలు సాధించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయండి. వారికి ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తుంది. క్రీడల్లో రాణించిన క్రికెటర్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ డీఎస్పీ అయ్యారని రేవంత్ తెలిపారు. చాలా చోట్ల కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అందడం లేదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రతి గ్రామానికి జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులే. జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించేలా చేశారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు తమ సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకున్నారు? నేనూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే ఈ స్థాయికి వచ్చాను. గతంలో గురుపూజోత్సవం ఎప్పుడైనా జరిగిందా..? అందులో సీఎం పాల్గొన్నారా? తెలంగాణ పునర్నిర్మాణంలో టీ-చర్ల సహకారం కావాలి. పిల్లలు ఎక్కువ సమయం టీచర్ల వద్దే ఉంటారు. పిల్లలతో కలిసే టీచర్ల మధ్యాహ్న భోజనం చేయాలి. వర్సిటీలకు వీసీలను నియమించడానికి గత ప్రభుత్వానికి తీరిక లేదు. ప్రస్తుతం ప్రభుత్వం, టీ-చర్ల చొరవతో కొత్తగా 3 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ప్రైవేట్ స్కూళ్ల టీ-చర్ల కంటే.. ప్రభుత్వ టీచర్లకు నైపుణ్యం ఎక్కువ. వివాదాస్పదమైన విద్యాశాఖ తీసుకోవద్దని నాకు కొందరు సూచించారు. అయినా వినకుండా ఈ శాఖను నా వద్దే ఉంచుకున్నా అని రేవంత్‌రెడ్డి అన్నారు. చాలా మంది ముఖ్యమంత్రులు ఫైనాన్స్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను తమ దగ్గర పెట్టు-కుంటారు. కానీ తాను విద్యాశాఖను తన దగ్గర పెట్టు-కున్నట్లు- తెలిపారు. అత్యంత వివాదాస్పద శాఖ విద్యా శాఖ.. అది తనకు వద్దని పలువురు చెప్పారు... కానీ వివాదాస్పదం సంగతి చూద్దామనే తన దగ్గర పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి విద్యాశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమైన శాఖ అని.. అందుకే దానిని తాను పర్యవేక్షిస్తున్నట్లు- చెప్పారు. కొంత మంది అవగాహన రాహిత్యంతో ఈ శాఖకు మంత్రిని పెట్టమని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. విమర్శలకు ఒకటే మాట చెప్తున్నా... ఈ శాఖలో ఉన్న సమస్యల పరిష్కారం కోసమే దీనిని తన దగ్గర పెట్టుకున్నట్లు- స్పష్టం చేశారు.గత ప్రభుత్వంలో గురుపూజోత్సవం జరిగిందా.. ఆ కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి వచ్చారా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మీ లాంటి టీ-చర్‌లు చెప్పిన చదువు నేర్చుకునే ఈ స్థాయికి వచ్చానని ఆయన అన్నారు. ఉపాధ్యాయులను చిన్నచూపు చూసే ఆలోచన ప్రజాప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు ఎక్కువగా ఉన్న, తక్కువగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారని, దీనికి కారణం అయితే తాను కావాలి లేదంటే ఉపాధ్యాయులు అయ్యి ఉండాలని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్‌లో కన్నా ప్రభుత్వ స్కూల్ టీ-చర్‌లు అధికంగా చదువుకున్నవారు.. ఇకపై సర్కార్ స్కూల్స్‌లో పిల్లల నమోదు సంఖ్య పెరగాలని అన్నారు. స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అందుకే ప్రతి ఏడాది రూ.130 కోట్ల సీఎస్‌ఆర్ నిధులు పాఠశాలలో క్లీనింగ్‌కు కేటాయించినట్లు- పేర్కొన్నారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురవడం తనకు బాధ కలిగిందని సీఎం అన్నారు. ఇకపై ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని.. అప్పుడప్పుడు తాను కూడా వచ్చి మీతో, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తానని సీఎం అన్నారు.

## నేటి నిమజ్జనానికి భారీగా ఏర్పాటు

(మొదటి తరువాయి)

నిమజ్జనం సమయం లో కరెంట్ పోకుండా, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. 10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న విగ్రహాల వెంట ఒక విద్యుత్ శాఖ అధికారి ఉండనున్నారు. వినాయక నిమజ్జనం పోలీసులకు ఛాలెంజింగ్ అని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ అన్నారు. నిమజ్జనం ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ చాలా కీలకమని, అందుకే నెల ముందు నుంచే ఏర్పాట్లు- చేసినట్టు చెప్పారు. ఆర్‌అండ్‌బీ, సమాచారశాఖ, జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, రవాణా, విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. శనివారం ఉదయం 6గంటలకు ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనం ప్రారంభమై.. మధ్యాహ్నం 2గంటలకు పూర్తయ్యే అవకాశముంది. నిమజ్జన కార్యక్రమంలో సుమారు 10లక్షల మంది పాల్గొంటారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు- చేశాం. 3,200 మంది ట్రాఫిక్ పోలీసులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. నిమజ్జనంలో పాల్గొనే భక్తులు ప్రజారవాణాను ఎక్కువగా ఉపయోగించు కోవాలని సీపీ తెలిపారు. గణేష్ నిమజ్జనాల కోసం నెల రోజుల ముందునుంచే రూట్ సర్వే చేసి ఆయా విభాగాలకు అవసరమైన సూచనలు ముందుగానే చేశామని తెలిపారు. విగ్రహాలు అమ్మే దూల్ పేట్ లాంటి ప్రాంతాల్లో కూడా ప్రణాళికా బద్ధంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు- చెప్పారు. ఈ సారి వినాయక నిమజ్జనాలకు పది వేల పైగా టస్కర్ వాహనాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పది లక్షల మంది భక్తులు నిమజ్జనంలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. శనివార ఉదయం ఆరు గంటలకు బడా గణేష్ శోభాయాత్ర స్టార్ట్ అవుతుందని తెలిపారు. నాలుగో నెంబర్ క్రేన్ వద్ద 12 గంటల వరకు నిమజ్జనం పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. బడా గణేష్ నిమజ్జనం చూడటానికి వచ్చేవారు వ్యక్తిగత వాహనాలు కాకుండా ప్రజా రవాణా వినియోగించాలని కోరారు. నిమజ్జనానికి వచ్చే వాహనాల కోసం ఎన్టీఆర్ స్టేడియం, కట్టమైసమ్మ దేవాలయం, పబ్లిక్ గార్డెన్స్, బుద్ధభవన్ వెనుక, ఆదర్శనగర్, బీఆర్కే భవన్, ఖైరతాబాద్ ::ఘా స్టేషన్ తదితర ప్రాంతాలలో పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు- చేసినట్లు- తెలిపారు.

వినాయక విగ్రహాలు వచ్చే రూట్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని.. భక్తులు, వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. బాలాపూర్ నుంచి వచ్చే ప్రధాన శోభాయాత్ర చార్మినార్, అబిడ్స్, లిబర్టీ, ట్యాంక్ బండ్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వెళ్తుందని తెలిపారు. ఆయా రూట్లో జనరల్ ట్రాఫిక్ అనుమతి ఉండదని చెప్పారు. ఇక సికింద్రాబాద్ నుంచి వచ్చే విగ్రహాలు ప్యాటీ-÷-న, పారడైజ్, రాణిగంజ్, కర్బలామైదాన్ నుంచి ట్యాంక్ బండ్ కు చేరుకుంటాయని చెప్పారు. టోలిచౌకీ, మెహిదీపట్నం నుంచి వచ్చేవి ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ చేరుకుంటాయని అన్నారు. టప్పచబుత్ర, ఆసిఫ్ నగర్ నుంచి వచ్చే విగ్రహాలకు ఎంజే మార్కెట్లోకి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ప్రధాన నిమజ్జన రూట్లలో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు- తెలిపారు సీపీ జోయల్ డేవిస్. సౌత్ ఈస్ట్ జోన్ కేశవగిరి, చాంద్రాయణగుట్ట, మూసారాంబాగ్, చంచల్ గూడ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు మళ్లింపులు ఉంటాయని తెపారు. అలియాబాద్, మదీనా, నయాపూల్, ఎంజే మార్కెట్, దరుశిఫా ప్రాంతాలలో ట్రాఫిక్ ను మళ్లించనున్నట్లు- చెప్పారు. ఇదిలావుంటే శుక్రవారం కూడా ఖైరతాబాద్ వద్ద భక్తుల రద్దీ కొనసాగింది. మహాగణపతి దర్శనం నిలిపివేసినప్పటికీ శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ నేపథ్యంలో గణనాథుడిని దూరం నుంచి చూసేందుకు నిర్వాహకులు అనుమతిస్తున్నారు. మరోవైపు శనివారం మహాగణపతి నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## దండకారణ్యంలో మళ్లీ నెత్తుటి ధార

**-బస్తర్‌లో ఎదురుకాల్పులు**
**-ఆరుగురు మావోయిస్టులు మృతి**

**రాయ్ పూర్ ,సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** దండకారణ్యంలో మళ్లీ నెత్తుటి ధార పారింది. బస్తర్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య శుక్రవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో మొదలైన కాల్పులు ..సాయంత్రం వరకు కొనసాగాయి. ఈ ఘటనలో మరికొందరు మావోయిస్టులు తీవ్రంగా గాయపడ్డారు. భారీ వర్షాల కారణంగా కొంత విరామం ఇచ్చిన తర్వాత బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులను లక్ష్యంగా చేసుకొని భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. నారాయణ్‌పూర్, దంతెవాడల



మధ్య శుక్రవారం ఉదయం నుండి కాల్పుల మోత సాగుతోంది. అబుజమద్ ఏరియాలోని అడవుల్లో కీలకమైన సమావేశం కోసం మావోయిస్టులు పెద్ద సంఖ్యలో గుమిగూడినట్లు తమకు సమాచారం అందిందని సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు. ఈ సమాచారం అందిన వెంటనే డ్రాగన్ రైజింగ్ గ్రూప్ (డిఆర్‌జి) సైనికులను అక్కడకు పంపారు. ఉదయం 9గంటల ప్రాంతంలో సైనికులు, మావోయిస్టుల మధ్య కాల్పులు ఆరంభమయ్యాయి. దీనిపై ఎస్‌పి గౌరవ్ రారు మాట్లాడుతూ, పోలీసులు వస్తున్న విషయం తెలియగానే నక్సలైట్లు అడవిలోకి వెళ్లిపోయారని..ఆ తర్వాత ఇరు పక్షాల నుండి కాల్పులు మొదలయ్యాయని చెప్పారు. ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయన్నారు.

## 2025 సెప్టెంబర్ 6, శనివారం తెలుగు పంచాంగం




మాసం- పక్షం
భాద్రపద మాసం
శుక్లపుష్కం
తిథిజి
చతుర్దశి: సెప్టెంబర్ 6 ఉదయం 3:13 - సెప్టెంబర్ 7 ఉదయం 1:41
పూర్ణిమ: సెప్టెంబర్ 7 ఉదయం 1:41 - రాత్రి 11:38
నక్షత్రం
ధనిష్ట: సెప్టెంబర్ 5 రాత్రి 11:38 - సెప్టెంబర్ 6 రాత్రి 10:55
శతభిష: సెప్టెంబర్ 6 రాత్రి 10:55 - సెప్టెంబర్ 7 సాయంత్రం 9:41
సూర్యోదయం: ఉదయం 6:06
సూర్యాస్తమానం: సాయంత్రం 6:22
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: 4:30 - 5:18
అభిజిత్ ముహూర్తం: 11:50 - 12:39
అమృతకాలం: 12:49 - 2:22
అశుభ సమయాలు
రాహుకాలం: 9:10 - 10:42
యమగండం: 1:46 - 3:18
గులికా: 6:06- 7:38
దుర్ముహూర్తం: 7:44- 8:33
వర్జ్యం: 5:45- 7:16

# కర్తాల్ బస్టాండ్ వద్ద రోడ్డు ప్రమాదం

### – ఒకరు మృతి, ఇద్దరు గాయాలు



**కడ్తాల్, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సత్యసాయి జిల్లా నల్లమడ గ్రామం, కొండ్రవారి పల్లికి చెందిన ముగ్గురు కూలీలుజిన్నే రంగులు (54), ఆదిలక్ష్మి (45), నర్సాపూర్ కిష్టప్ప (56)తోట పనుల కోసం సెప్టెంబర్ 5వ తేదీ ఉదయం ఆంధ్రప్రదేశ్ నుంచి కడ్తాల్ బస్టాండ్‌కి చేరుకున్నారు. తోటకు వెళ్లేందుకు బస్సు దిగిన అనంతరం బస్టాండ్ వద్ద నిలబడి ఉన్న సమయంలో, హైదరాబాద్ నుంచి డిండి వెళ్తున్న TS07FV 2299 నంబర్ గల కారు వేగంగా వచ్చి వారిపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, రంగులు మరియు ఆదిలక్ష్మిని ఉస్మానియా ఆసుపత్రికి, కిష్టప్పను యెన్నం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రంగులు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. గతంలో లేబర్‌గా పనిచేస్తున్న ఈ ముగ్గురు కుటుంబాలపై ఈ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ప్రమాద సమాచారం మేరకు కడ్తాల్ పరిధిలోని గ్రామస్తుడు పసుపులేటి ఆంజనేయులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ గంగాధర్ తెలిపారు. వాహనదారులు నిద్రలేమి లేదా అలసట అనిపించినప్పుడు వాహనం పక్కకు ఆపి విశ్రాంతి తీసుకోవాలని, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా జాగ్రత్తగా నడపాలని ఆయన సూచించారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు



**వంగూరు, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వంగూరు మండల కేంద్రంలో శుక్రవారం మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మజీద్ కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ చైర్మన్ ఆరిఫ్ ఖాన్ మాట్లాడుతూప్రవక్త మహమ్మద్ సూచించిన మార్గంలో ప్రతి ముస్లిం నడవాలని, ఆయన జీవనశైలి ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ జహంగీర్, అయూబ్ ఖాన్, జిల్లా కోఆప్షన్ సభ్యులు హమీద్, కమిటీ సభ్యులు ఖలీల్, శానవాజ్, అన్వార్, యూసఫ్ ఖాన్, ఖాయమ్ ఖాన్, రఫీ, జానీ, అఖిల్, జావీద్, సోహెల్, రహిమత్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.


# గుంతలు పుడిపించిన బిఆర్ఎస్ నాయకులు



**కురవి,సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవల వచ్చిన వర్షాలకు రహదారులు గుంతలమయంగా మారాయి. కురవి మండలం నల్లెల్ల నుండి గాజ తండ, టేకుల తాండ, రాజోలు లింగ్య తండ, బలపాల మరియు డోర్నకల్. నల్లెల్ల నుండి కురవి, మహబూబాబాద్ వెళ్లే ప్రధాన అంతర్గత రహదారి పై ఉన్న కల్వర్టు వర్షాలకు పెద్ద గుంతలు పడి ఆయా గ్రామాలకు వెళ్లే వాహనాదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి గుండానే వాహనాదారులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది చూసి నల్లెల్ల మాజీ ఎంపీటీసీ మంచిప్రోలు చంద్రారెడ్డి మరియు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అద్యక్షులు నిమ్మలగంటి కృష్ణమూర్తి తమ సొంత నిధులతో గుంతలు పుడిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా మారాయి తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు.

# వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరగాలి

### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, సెప్టెంబర్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్ న్యూస్):**
వినాయక నిమజ్జనోత్సవాలు ప్రజల్లో భక్తి ప్రబత్తులకు, యువతలో ఐక్యతకు నాంది కావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆకాంక్షించారు . శనివారం వనపర్తి పట్టణంలోని 11వ వార్డు రామ్‌నగర్ కాలనీ, పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామాల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తుల ఆహ్వానం మేరకు ఆయన వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రజలు, యువత భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. చివరి రోజు నిమజ్జనం ప్రశాంతంగా, సఖ్యతతో కొనసాగాలని విజ్ఞప్తి చేశారు. విజయ గణపతి విఘ్నాలు తొలగించి విజయాలు ప్రసాదించాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ముఖ్యనేతలు చిట్యాల రాము, నందిమల్ల సుబ్బు, అనుపటి రాము, అలీమ్,తోట శీను,రవి,శ్రీను, డా. శ్రీను,కిషోర్,వెంకటేష్,మల్లారెడ్డి, వెంకటయ్య,సతీ రెడ్డి,రాకేష్,భాను ప్రకాష్, హరీష్,శివకార్తీక్,జయప్రకాశ్, ప్రవీణ్,భరత్,సాయి, నితిన్,నవీన్, రెహమాన్,నరేందర్,అభి తదితరులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుపై మోడీ చిత్రపటానికి పాలాభిషేకం




**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకున్న చారిత్రాత్మక జీఎస్టీ తగ్గింపు నిర్ణయాన్ని ప్రశంసిస్తూ, టౌన్ బీజేపీ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్ కుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. "జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు, వ్యాపారులకు, రైతులకు, విద్యార్థులకు భారీ ఊరట లభిస్తోంది. ముఖ్యంగా వైద్య, ఇన్సూరెన్స్ రంగాలు, చిన్న పిల్లల పాఠ్యపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లపై 0 శాతం జీఎస్టీ వర్తింపజేయడం అభినందనీయం" అని నాయకులు పేర్కొన్నారు. ఇంతకుముందు 28 శాతం,18 శాతం,12 శాతం ఉన్న అనేక వస్తువులపై ఇప్పుడు 5 శాతం లేదా 0 శాతం జీఎస్టీ వర్తించడంతో సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ నాగేంద్ర గౌడ్, ఎన్నికల అధికారి బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు పోల్దాస్ రాము, ట్రెజరర్ రాజారామేశ్వరరావు, మండల నాయకులు, కార్యకర్తలు, పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




**కరీంనగర్, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా మహిళా ఆవోపా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు బొడ్ల గీతారాణి మాట్లాడుతూ"గురువు తన వృత్తిని నిబద్ధతతో నిర్వహిస్తే, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దే శక్తి ఆయనకు ఉంటుంది" అని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయురాళ్లకు సన్మానాలు చేశారు. ఈ వేడుకలో ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, కోశాధికారి శ్రీలత, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ యశ్వంత్ సింగ్



**యాచారం,సెప్టెంబర్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యాచారం మండల కేంద్రంలోని నంది వనపర్తి రోడ్ లో గణేష్ సేవాదళ్ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుని వద్ద ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ యశ్వంత్ సింగ్ , కుటుంబ సమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణేష్ సేవాదళ్ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుపై వ్యాపార వర్గాల్లో హర్షం



**మంచాల, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జీఎస్టీ తగ్గింపుపై వివిధ రంగాల వ్యాపారులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, బీజేపీ మంచాల మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ"రైతులకు అవసరమైన ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, దీర్ఘకాలిక వ్యాధుల మందులు, నిత్యావసర వస్తువులపై పన్ను తగ్గింపు ప్రజలకు మేలు చేస్తుంది. వ్యాపార వర్గాలకు ఇది ఊరట కలిగిస్తుంది" అని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్ని రంగాల్లో సహాయ సహకారాలు అందిస్తోందని ఆయన తెలిపారు.

# ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపిన యువ నాయకుడు



**తలకొండపల్లి, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
'గురు సాక్షాత్ పరబ్రహ్మ" అంటూ ఉపాధ్యాయుల గొప్పతనాన్ని కొనియాడిన యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. "చిరుదీపంలా మార్గదర్శనం చేసే ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు" అని పేర్కొన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ వృత్తికి వందనం చేశారు.

## వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణం, గణేష్ నిమజ్జనం వైభవంగా





**సైనిక్‌పురి, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** వినోభా నగర్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా తిరుకల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం గణేశ మండపంలో లడ్డూ, నోట్ల దండలు, శేషవస్త్రాల వేలంపాట జరిగింది. లడ్డూ 2,11,000కి యంసాని వెంకటేష్ దంపతులు, నోట్ల దండలు 1,00,000కి ఇల్లెందుల సంతోష్ దంపతులు, శేషవస్త్రాలు 12,116కి గుబ్బా హరీష్ దంపతులు దక్కించుకున్నారు. గత సంవత్సరం లడ్డూ 2,15,116కి అత్తెల్లి రామనాథం కుటుంబం పొందిన విషయం గుర్తుచేసుకున్నారు. వేలంపాట అనంతరం విఘ్నేశ్వరుడి విగ్రహంపై కలశాలతో నీరు పోసి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. 500కి పైగా భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు.

## జీఎస్టీ లో రాయితీలు... ప్రధానికి భాజపా ధన్యవాదాలు....



**అంబర్పేట్, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భారతీయ జనతా పార్టీ బాగ్ అంబర్పేట్ డివిజన్ అధ్యక్షులు పి నాగరాజు చారి ఆధ్వర్యంలో దసరా నవరాత్రులు, దీపావళి పండుగల్ని పురస్కరించుకొని దేశ ప్రజలకు జీఎస్టీ లో రాయితీలు కల్పించినందుకు గాను ప్రియతమ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి రెడ్ బిల్డింగ్ చౌరస్తాలో పాలాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు డా. ఎన్.గౌతమ్ రావు, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్ కుమార్ లు పాల్గొని పాలాభిషేకం చేయడం జరిగింది. దేశ ప్రజలకు ప్రధానమంత్రి మోడీ దసరా, దీపావళి లకు దేశ ప్రజలకు ఇస్తున్నటువంటి బోనస్ గా వారు అభివర్ణించారు. నిత్యవసర వస్తువుల పైన, ప్రజలకు సంబంధించిన ఆరోగ్య వస్తువుల పైన, చదువులకు సంబంధించిన వస్తువుల పైన జిఎస్టిని తగ్గించడం ప్రజలకు ఊరట నిస్తుందని అభివర్ణించారు ఈ కార్యక్రమంలో నాయకులు సి.కృష్ణ గౌడ్, జీ.మల్లేష్, ఈ.ఎస్.ధనంజయ, చుక్క జగన్, పి.గోవర్ధన్ రెడ్డి, అచ్చిని రమేష్, కెంచే చంద్రశేఖర్, ఎన్.దత్తు, కే.ప్రవీణ్, డి.వెంకటేష్, డి.భాస్కర్ రావు, విజయశేఖర్, ఏ.పరమేష్ యాదవ్, ఆర్.రామ్ రెడ్డి, ఏడెల్లి బాలు, రోహిత్ గౌడ్, జి శ్రీనివాస్, కే.కనకలక్ష్మి, జి.మహేష్ గౌడ్, వి.రాఘవేంద్ర, రవికాంత్, నిఖిల్ గౌడ్, చిట్టిబాబు, సరళ, రాజశేఖర్, దుర్గాప్రసాద్, కే.సాయికుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి ఆర్ఎంపి డాక్టర్ల సంఘం అధ్యక్షుడిగా తుమ్మ రమేష్



**తలకొండపల్లి, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకి ఫంక్షన్ హాల్లో గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తలకొండపల్లి మండల ఆర్ఎంపి డాక్టర్ల సంఘం అధ్యక్షుడిగా తుమ్మ రమేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బుర్ర పాండు, ప్రధాన కార్యదర్శిగా మానేమోని శివకృష్ణ, కార్యదర్శులుగా రామకృష్ణ, శేఖర్, ప్రచార కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా ప్రభాకర్, జగన్, మాణిక్యం, గ్రామీణ వైద్యుల అధ్యక్షులుగా రవి, ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించగా, గ్రామీణ వైద్యులందరికీ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. మండలంలోని వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డిండి మండల కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**దేవరకొండ,సెప్టెంబర్ 05(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
డిండి మండల కేంద్రములో శుక్రవారం మహమ్మద్ ప్రవక్త జన్మదినమును(మీలాద్ ఉన్ నబి) పురస్కరించుకొని స్థానిక ముస్లిం మైనారిటి కమిటీ ఆధ్వర్యములో వేడుకలు ఘనంగా నిర్వహించారు .మైనారిటి కమిటీ అధ్యక్షులు షేక్ ఉమర్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినము ముస్లింలకు ఇది చాలా పెద్ద పండుగ గా ప్రతి సంవత్సరము ఘనముగా నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక ఖాద్రియ మజీద్ విద్యుత్ అలంకరణ చెయ్యడముతో మరియు గురువారము రోజు రాత్రి జాగరణ చెయ్యడము మరియురాత్రి నమాజులు చదివారు, శుక్రవారము రోజు ప్రవక్త జన్మదినమును పురస్కరించుకొని అన్నదానం కార్యక్రమము నిర్వహించారు .ఈ కార్యక్రమములో మైనారిటి మాజీ అధ్యక్షులు పీర్ మొహమ్మద్, మొహమ్మద్ అబ్దుల్ కలీమ్, అబ్దుల్ ఖాదర్, మొహమ్మద్ రషీద్, మైనారిటి కమిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖయ్యుమ్, చాంద్ పాషా, అబ్దుల్ రహీం, ఇమామ్ నాజూరుల్ హక్, అబ్దుల్ సలీం, అబ్దుల్ రహమాన్, అబుల్లా, జహంగీర్, ఖదీర్, మహమ్మద్ సీరాజ్,అబ్దుల్ సలాం, అబ్దుల్ రజాఖ్, మైనొద్దీన్, మైనారిటి యూత్ మాజీ అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యుమ్, సోహెల్, అవేజ్, సద్దాం, గఫూర్, ఉమర్, మొయిన్, మెహరాజ్, తున్ను, బాసీద్, రహమతుల్లాహ్, మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ శోభయాత్రలో అపస్రుతి

**– ట్రాక్టర్ ను ఢీకొన్న డీసీఎం ఇద్దరి మృతి ఇద్దరు పరిస్థితి విషమం**



**పెబ్బేర్, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి జిల్లా పెబ్బేర్ మండలం రంగాపూర్ లో విషాదం చోటుచేసుకుంది. గణేష్ శోభయాత్రలో రంగాపురం గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం సుమారు 01:35గంటల సమయంలో పాత గురుదత్త దాబా వద్దా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.వివరాలకు వెళితే హైదరాబాద్ వైపు వెళుతున్న రోడ్డుపై వనపర్తి మండలం నాచహళ్లి గ్రామానికి చెందిన 13మంది యువకులు బీచుపల్లి దగ్గర గణేష్ నిమజ్జనం ముగించుకొని తిరిగి గ్రామానికి ట్రాక్టర్ లో వెళుతున్నరు.ఈ క్రమంలో రంగాపూర్ దాటిన తర్వాత పాత గురుదత్త దాబా దగ్గర వెనకాల నుంచి వస్తున్న డీసీఎం (%AP39x1678) నెంబర్ ట్రాక్టర్ ను వెనక నుంచి ఢీ కొట్టింది.డీసీఎం డ్రైవర్ అతివేగంగా వచ్చి ముందు వెళ్తున్న ట్రాక్టర్ ను వెనకాల నుంచి ఢీకొట్టడం వల్ల ట్రాక్టర్ ఇంజన్ మీద కూర్చున్నటువంటి 5గురి లో ఇద్దరు వ్యక్తులు అక్కడక్కడ మృతి చెందారు.మృతి చెందిన వారు సాయి (25),శంకర్(28)లు మృతి చెందినట్లు మరో ఇద్దరు యువకులు అబ్దుల్లా,విష్ణు తీవ్ర గాయాలతో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్ తరలించారు మృతుల్లో గాయపడిన వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

## జీఎస్టీ తగ్గింపుపై మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**లింగాల, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
లింగాల మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గువ్వాని నవీన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. సామాన్య ప్రజలపై ఉన్న జీఎస్టీ భారాన్ని తగ్గించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.పేదలు, మహిళలు, యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు నిత్యావసర వస్తువులు తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పన్ను సంస్కరణలు చారిత్రాత్మకమని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా మోడీ, నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లా జనరల్ సెక్రటరీ పసునూరి విష్ణు చారి, ఇల్లెందుల శ్రీనివాసులు, బీజేవైఎం సాయి సాగర్, హేమంత్, శంకర్, శ్రీరాములు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


## గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం



**వర్ధన్నపేట, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వర్ధన్నపేట పట్టణం పిరంగి గడ్డ లో ముదిరాజ్ యువసేన యూత్ అసోసియేషన్ వారు ప్రతిష్టాపించిన గణపతి వద్ద శుక్రవారం కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ప్రత్యేక పూజలు చేశారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ముదిరాజ్ యువసేన యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద వేద పండితులు శేషం వెంకట రమణ చారి అధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విఘ్నేశ్వర స్వామి పూజ కార్యక్రమంలో కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం నిర్వాహకులు ఈగ మల్లేశంకు శాలువాగప్పి ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ ప్రజలందరి జీవితాల్లో విఘ్నాలు తొలగి సుఖ సంతోషాలతో ఉండాలని వారు స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిలివేరు కుమారస్వామి, జన్నపురెడ్డి దేవేందర్ రెడ్డి, కరిమిల్ల సంపత్ రావు, గణపతి ఉత్సవ కమిటీ యూత్ సభ్యులు నక్క రాజు, కుక్కల రాకేష్, బోనాల హరీష్, మట్టపల్లి అనిల్, భూమా రంజిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్బిడి లక్ష్మా రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన

**కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం**



**వర్ధన్నపేట, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అబ్బిడి లక్ష్మా రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి తండ్రి కీ. శే. అబ్బిడి లక్ష్మా రెడ్డి ప్రథమ వర్ధంతి శుక్రవారం వారి స్వగృహంలో జరిగింది.ఈ కార్యక్రమానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై లక్ష్మా రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో సిలివేరు కుమారస్వామి, జన్నపురెడ్డి దేవేందర్ రెడ్డి, కరిమిల్ల సంపత్ రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వెటర్నరీ అసిస్టెంట్‌గా ఎండి అఫ్సర్‌కు పదోన్నతి



**ఆమనగల్లు, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు పట్టణానికి చెందిన ఎండి అఫ్సర్ తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి పశు వైద్యశాలలో ఆఫీస్ సబర్డినేట్‌గా విధులు నిర్వహిస్తూ, కందుకూర్ పశువైద్యశాలకు వెటర్నరీ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాడు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా పశు సంపద శాఖ కార్యాలయంలో జిల్లా జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ చేతుల మీదుగా పదోన్నతి పత్రాన్ని అందుకున్నాడు.
ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, పశువైద్యశాల సిబ్బంది, గ్రామస్థులు శు భాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సత్కరించారు.

## ఘనంగా గణేష్ ఉత్సవ కమిటీ 41 వ వార్షికోత్సవ ఉత్సవాలు.

**:శాలిగౌరారం లో వైభవం గా వినాయక నిమజ్జనం.**

**శాలిగౌరారం, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
శాలిగౌరారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ దగ్గర లో ఉన్న గణేశుని 41వ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వినాయక నిమజ్జన వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి.భక్తులు కోలాటాలు మధ్యన బాణ సంచా కాల్చుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా విగ్నేశుని రథయాత్రలో పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో గణపతిని ఊరేగించి భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గుండా శివశంకర్, శ్రీకాంత్ తాందారి,మహేష్,కాగితాల నాగరాజు,తందారి వెంకటేష్, ఉపేందర్,మహేష్,నరేష్, శివరాజు,సతీష్,కంది వెంకన్న, హరీష్,తదితరులు విఘ్నేశుని శోభాయాత్రలో పాల్గొన్నారు.

# సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తూ పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ ,సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని పాత పట్టణంలోని హనుమాన్ పురాలో ఏర్పాటు చేసిన ఒకటవ నంబర్ వినాయక విగ్రహానికి మంత్రి పూజాధిక్యాలు నిర్వహించి గణేష్ శోభ యాత్రను ప్రారంభించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో గడచిన 30 సంవత్సరాల నుండి ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలను, నిమజ్జనాన్ని నిర్వహించుకోవడం సాంప్రదాయంగా వస్తున్నదని అన్నారు. ఈ సంవత్సరం కూడా అలాగే శాంతియుత వాతావరణంలో వినాయక శోభాయాత్ర, నిమజ్జనం నిర్వహించాలని యువతకు సూచించారు. ప్రత్యేకించి యువకులు ఎక్కడా అత్యుత్సాహం ప్రదర్శించవద్దని కోరారు. నల్గొండ పట్టణంలో మతసామరస్యంతో పాటు ,అన్ని మతాలను గౌరవిస్తూనే అభివృద్ధిని కొనసాగిస్తున్నామన్నారు. 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని మొదలుపెట్టామని, లతీఫ్ సాహెబ్ దర్గా గుట్ట ,బ్రహ్మంగారి గుట్టలకు 150 కోట్ల రూపాయలతో ఘాట్ రోడ్లు నిర్మిస్తున్నామని, 30%



పనులు పూర్తయ్యాయని చెప్పారు. ప్రభుత్వం ఈ సంవత్సరం వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్తును ఇవ్వడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ అన్ని శాఖల సిబ్బంది గణేష్ ఉత్సవ కమిటీల సహకారంతో క్రమశిక్షణను పాటిస్తూ 9 రోజులపాటు జిల్లాలో గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకున్నారని, గణేష్ శోభాయాత్ర తో పాటు, నిమజ్జనాన్ని కూడా ఇదేవిధంగా కొనసాగించాలని ఆమె కోరారు. నల్గొండ జిల్లాలో ప్రజలు గంగా, జమున ,తెహజీబ్ సాంప్రదాయాన్ని పాటిస్తారని అన్నారు . వినాయక నిమజ్జనం సందర్భంగా జిల్లా యంత్రాంగం తరఫున భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లను మానుకొని మన పూర్వీకులు ఇచ్చిన ఆదర్శాలు, సందేశాల స్ఫురణతో నిమజ్జనంలో పాల్గొనాలని, ఒక సంకల్ప దీక్షతో అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ గణేష్ శోభయాత్ర, నిమజ్జనాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా 2000 వేల మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు .నల్గొండ పట్టణంలో వెయ్యి మంది పోలీసులను నియమించామని ,టీఎస్ ఎస్పి స్పెషల్ పోలీస్ బెటాలియన్ కూడా జిల్లాకు వచ్చిందని దీనికి తోడు క్రైమ్ టీములను ఏర్పాటు చేశామని ,భద్రతపరంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని, హైదరాబాద్ తర్వాత నల్గొండ జిల్లాలోనే పెద్ద ఎత్తున వినాయక శోభాయాత్ర నిర్వహిస్తారని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించేందుకు గణేష్ ఉత్సవ కమిటీలు, అన్ని మతాలవారు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా హనుమాన్ నగర్ గణేష్ విగ్రహ కమిటీ అధ్యక్షులు ఇటుకల కృష్ణయ్య మాట్లాడారు. నల్గొండ ఆర్ డి ఓ వై. అశోక్ రెడ్డి ,గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కర్నాటి యాదగిరి, వక్త వెంకట్ నివాస్ ,చింతల సాంబమూర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ ,మాజీ జెడ్పిటిసి, లక్ష్మయ్య, గుమ్మల మోహన్ రెడ్డి, తదితరులు వినాయక విగ్రహానికి పూజలు నిర్వహించారు.

# స్కూల్ బస్సు కింద పడి చిన్నారి మృతి..

## -పాఠశాలను సీజ్



**హైదరాబాద్,సెప్టెంబర్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
స్కూల్ బస్సు కింద పడి చిన్నారి మృతిచెందిన ఘటన గురువారం నల్లగొండలో జరిగింది. నల్లగొండ మండలంలోని తొరగల్‌కు చెందిన చింతపల్లి జస్మిత (4) మాస్టర్స్‌మైండ్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. ఇంటి నుంచి స్కూల్ బస్సులో బడికి వచ్చింది. బస్సులోని విద్యార్థులు అంతా దిగి ఒక్కొక్కరుగా తరగతి గదులకు వెళ్తున్నారు. ఈక్రమంలో జస్మిత సైతం తోటి విద్యార్థులతో కలిసి తరగతి గదిలోకి వెళ్తుండగా డ్రైవర్ గమనించకుండా బస్సును కదలించాడు. దీంతో బస్సు విద్యార్థినికి తగిలి తీవ్రమైన గాయాలు కావడంతో పాఠశాల యాజమాన్యం నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలిచించారు. చిన్నారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే చిన్నారి చనిపోయిందని బాలిక తల్లి రాధిక ఆరోపిస్తోం ది. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కాసులకు కకుర్తి పడి సూల్ బస్సులకు శిక్షణ పొందని డ్రైవర్లను పెడుతున్నారని, కనీసం బస్సుకు సహాయకులను కూడా నియమించలేదని వారు మండిపడ్డారు. బస్సులో ఆయాలు లేకపోవడం, డ్రైవర్ నిర్లక్ష్యంతో చిన్నారి జస్విత చనిపోయిందని ప్రజాసంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్ విజయ్‌ను పోలీసుల అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు నల్లగొండ పట్టణం దేవరకొండ రోడ్డులోని మాస్టర్ మైండ్ పాఠశాలకు చెందిన విద్యార్థిని జస్మిత మృతికి పాఠశాల యాజ మాన్యమే కారణం అంటూ.. విచారణ పూర్తి అయ్యేంత వరకు పాఠశాలను సీజ్ చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి డీఈవోకు ఆదేశాలు జారీ చేశారు. విచారణ పూర్తి చేసిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

# గోదావరిఖనిలో పేకాట స్థావరంపై దాడి

## ఏడుగురు అరెస్ట్

**రామగుండం, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ (వంక బెండు) ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక దాడి జరిగింది. నమ్మదగిన సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులు అదుపులోకి తీసుకోబడ్డారు. దాడిలో రూ.11,840 నగదు, ఏడు మొబైల్ ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు. పట్టుబడిన వారిలో కూరగాయల విక్రేతలు, ఆటో డ్రైవర్లు, ఎస్సీసీఎల్ ఉద్యోగులు, హమాలీలు ఉన్నారు. పేకాట స్థావరాలపై పోలీసులు చేపట్టిన ఈ చర్య స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల సహకారంతో ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీస్ అధికారులు తెలిపారు.

## ఓడ చెట్టు గణనాథుని లడ్డూను 1.11 లక్షలకు సొంతం చేసుకున్న చెన్న బ్రదర్స్‌కు



**మహేశ్వరం, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహేశ్వరం మండలం పెద్దపులి నాగారం గ్రామంలోని బొడ్రాయి పూడ చెట్టు వద్ద మహా గణనాథుని లడ్డూ వేలంపాట కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ పెద్దల సమక్షంలో చెన్న బ్రదర్స్‌చెన్న సంతోష్, చెన్న రామ్ చరణ్‌లడ్డూను ?1,11,000కి కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఎస్సిఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, యువజన సంఘం నాయకులు, వివిధ పార్టీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ లడ్డూ వేలంపాట గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ల్యాండ్ రికార్డ్స్ డీడీగా సుంకరి నరహరి రావు కు పదోన్నతి...

## ఘన సత్కారం...



**హైదరాబాద్, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ పదోన్నతి పొందిన సుంకరి నరహరి రావు కు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం మహాసభ కాచిగూడ రాష్ట్ర అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా సన్మానించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో కొండూరు వినోద్, కావేటి గోవిందరాజులు కట్టెల సుభాష్, బొక్క వేణుగోపాల్, ఏనుగుల సత్యనారాయణ మరియు అపెక్స్ కమిటీ కన్వీనర్ మీసాల చంద్రయ్య మరియు నాచారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పాదం వెంకటేష్ మరియు అడ్వైజర్ ఆకుల మల్లేశ, దర్శనాల వెంకటేష్, మూల వెంకటేష్ లు ఈ కార్యక్రమంలో నరహరి ని ఘనంగా సన్మానించడం జరిగింది.

# గణనాథునికి ప్రత్యేక పూజలు

**యాచారం,సెప్టెంబర్ 05(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వినాయక నవరాత్రి ఉత్సవాల భాగంగా యాచారం మండల కేంద్రంలో ప్రతిష్టించిన గణనాధుని శుక్రవార పూజ కార్యక్రమంలో యాచారం మండలం ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆర్యవైశ్య సంఘం మహిళలు విఘ్నేశ్వరునికి పూజలు

# ఉత్తమ ఉపాధ్యాయుడుగా మేకల రమేష్



**నల్లగొండ,సెప్టెంబర్ 5( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తిప్పర్తి మోడల్ స్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మేకల రమేష్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. శుక్రవారం నల్లగొండ లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు స్వీకరించటం తన బాధ్యతను ఇంకా పెంచిందని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఇంకా కృషి చేస్తానని తెలిపారు రమేష్ ఎంపిక పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ అపర్ణ, ఇతర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# ఉత్తమ అధ్యాపకురాలిగా డాక్టర్ గీతాంజలికి రాష్ట్ర పురస్కారం







**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ & పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. గీతాంజలికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక పురస్కారం ప్రదానం చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాదులోని శిల్పకళా వేదిక, శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు."ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను కలిగించింది. కళాశాల అభివృద్ధికి నా కృషిని కొనసాగిస్తాను" అని డాక్టర్ గీతాంజలి పేర్కొన్నారు. ఆమెకు అవార్డు లభించడంతో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ప్రవక్త జన్మదినం సందర్భంగా రోగులకు అన్నదానం



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో మొహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మైనార్టీ యువజన సంఘం నాయకుడు ఎం.డి. నసీర్ ఆధ్వర్యంలో రోగులు, వారి బంధువులకు అన్నదానం నిర్వహించారు. భోజన ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ రెహమాన్, మండల అధ్యక్షుడు ఖాజా బాబా, మజీద్ కమిటీ అధ్యక్షుడు ముబీన్ అహ్మద్ ఖాన్, టీ ఎన్జీవో జిల్లా కోశాధికారి ఎం.డి. షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. "ప్రవక్త హజరత్ మొహమ్మద్ ముస్తఫా జీవితం పేదల సేవకు మార్గదర్శకం. ఆయన సందేశాలు మానవాళికంతటికీ వర్తించేవి" అని నిర్వాహకుడు నసీర్ పేర్కొన్నారు.ప్రపంచంలో శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రేమ, సమానత్వం పంచుతూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రవక్త పుట్టిన రోజు జరపడం అభినందనీయమని హాజరైన నాయకులు ప్రశంసించారు.

## ఉపాధ్యాయ వృత్తి విశిష్టమైంది: టీచర్ చంద్రకళ

**చాగలమర్రి,సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో విశిష్టమైనదని టీచర్ చంద్రకళ అన్నారు. శుక్రవారం పూర్వ ప్రాథమిక విద్య పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ, తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషిస్తారని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దేశాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం





మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ , సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** ఉపాధ్యాయ దినోత్సవం మరియు దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీతలకు ఆయన శు భాకాంక్షలు తెలియజేస్తూ.. సమాజంలో అమ్మా,నాన్నల తర్వాత స్థానం గురువుకి ఇచ్చారని ,గురువు గొప్పతనాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ దేశానికి బాగా చాటి చెప్పారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. అంధకారాన్ని తొలగించి అజ్ఞానం స్థానంలో జ్ఞానాన్ని బోధించే గొప్ప వ్యక్తి గురువని అన్నారు. అలాంటి గురువుల ద్వారా సమాజానికి అవసరమయ్యే భావి భారత పౌరులను తీర్చిదిద్దే విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుందని అన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంలోనే పోటీపడే విధంగా ఒక్కొక్కటి 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, మొట్టమొదటి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు నల్గొండలోనే ప్రారంభమయ్యాయని తెలిపారు. డి ఎస్ సి ద్వారా ఉపాధ్యాయుల నియామకాన్ని చేపట్టి విద్యావ్యవస్థను పటిష్టం చేశామని, పాఠశాలలు, విద్యాసంస్థలలో మౌలిక వసతుల కల్పన,ఉపాధ్యాయులకు శిక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహించి మెరుగైన బోధన అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నల్గొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించే బాధ్యత గురువులపై ఉందని, అలాంటి గురువులు సమాజంలో గొప్పవారని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదని, ప్రభుత్వం విద్యారంగాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నదని ,ప్రత్యేకించి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఒక ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకొని ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా కార్పొరేట్ తరహాలో సొంత నిధులు వెచ్చించి నిర్మిస్తుండడం పట్ల ఆయన మంత్రిని అభినందించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, విద్యార్థులను ప్రత్యేకించి మారుమూల ప్రాంత విద్యార్థులకు మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులతో కోరారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయుల కృషి వల్లనే గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 12 శాతం విద్యార్థుల నమోదు పెరిగిందన్నారు. ఉపాధ్యాయుల కృషితోనే జిల్లాలో ఎక్కడ లేని విధంగా భవిత కేంద్రాలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని, దీని ద్వారా మానసిక వికలాంగుల పిల్లలకు ఎంతోఉపయోగకరమని అన్నారు. తాను జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రారంభమైన ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎలెక్షన్లను విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర మర్చిపోలేనిదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతిస్తున్నదని, ఇందులో భాగంగానే జిల్లాలో విద్యాభివృద్ధి కి గాను మైనింగ్ ద్వారా వచ్చే నిధులలో 70 శాతం విద్యాశాఖ కి 30 ఖర్చు పెట్టాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు. ఉపాధ్యాయులు మంచి విద్యను అందిస్తే విద్యార్థుల గుండెల్లో నిలిచిపోతారన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. మరో ఎమ్ ఎల్ సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సమాజానికి దిశా ,దశ , నిర్దేశం చేసేది ఉపాధ్యాయుడేనని అన్నారు. అవార్డులతో నిమిత్తం లేకుండా ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం పై దృష్టి సారించాలని కోరారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, అడిషనల్ ఎస్పీ రమేష్ ,నల్గొండ ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, డిఈఓ బిక్షపతి ,మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ప్రభుత్వానికి కృతజ్ఞతలు

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి...



**హైదరాబాద్, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి చట్టం -2025 అమలులోకి తీసుకురావడంతో పాటు గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా జీపీవోలకు నియామక పత్రాలను అందించడం వలన గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుంది. రాష్ట్రంలో ఆనవాళ్ళు కోల్పోయిన రెవెన్యూ శాఖను పునర్నిర్మాణం చేస్తున్న ముఖ్యమంత్రి శ రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ తరుపున, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ తరుపున, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ తరుపున, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తరుపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ చేసింది. అలాగే సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో దేశంలో ఎక్కడా కూడా లేని సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను సృష్టించడం, రెవెన్యూ ఉద్యోగుల పదోన్నతులు కల్పించడం, ప్రభుత్వానికి రెవెన్యూ ఉద్యోగులందరం రుణపడి ఉంటాము. అలాగే సర్వేయర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు లైసెన్సుడ్ సర్వేయర్ లను నియమించ్చేందుకు ప్రభుత్వం హామీ ఇవ్వడం వలన గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ప్రజలకు, రైతులకు మెరుగైన సేవలు నిర్ణిత కాలంలో అందుతాయి. అలాగే రెవెన్యూ ఉద్యోగులకు అండగా ఉంటానని సీఎం చెప్పడంతో జీపీవోలతో పాటు రెవెన్యూ శాఖ ఉద్యోగులందరూ రెట్టించిన ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తారు. జీపీవోల నియామక సభలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్ష కార్యదర్శులు రాములు, పాక రమేష్, టీజీఆర్ఎస్ఏ అధ్యక్ష కార్యదర్శులు బాణాల రామ్ రెడ్డి, బిక్షం, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ, టీజీటీఏ రాష్ట్ర నాయకులు పూల్ సింగ్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర కోశాధికారి మల్లేష్, సీసీఎల్ఏ నాయకులు రాంబాబు, చైతన్య, సుజాత చౌహాన్ తదితరులు సీఎం రేవంత్ రెడ్డి ని కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

# కరీంనగర్‌లో గణేశ నిమజ్జనోత్సవాలకు ఘన చరిత్ర ఉంది

– కేంద్ర మంత్రి బండి సంజయ్




**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాలు ఈ సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. 1946 నుంచి కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం, పాతబజార్ నెంబర్ 1 గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ పూజల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాల్గొని గణనాథునికి నమస్కరించారు.డప్పు వాయిద్యాల మధ్య భక్తులు వినూత్న రీతిలో బండి సంజయ్‌కు స్వాగతం పలికారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణలో కృషి చేసిన పోలీసులను శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రి టవర్ సర్కిల్ వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడకు యువత, చిన్నారులతో సహా భారీగా భక్తులు తరలివచ్చి, జై గణేశ్ నినాదాలతో వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, “గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా పూజలు అందుకున్న వినాయకుడు నేడు నిమజ్జనానికి సిద్ధమయ్యాడు. గత 79 సంవత్సరాలుగా నెంబర్ 1 గణనాథుడి పూజ అనంతరం మిగిలిన విగ్రహాల నిమజ్జనం జరగడం ఆనవాయితీ. ఈసారి మండపాల సంఖ్య పెరిగింది. ప్రతి ఇంట్లో, అపార్ట్‌మెంట్‌లో గణేశ్ విగ్రహాలు ప్రతిష్ఠించబడ్డాయి. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవాలు జరుపుకోవాలి. తప్పుడు ప్రచారాలను నమ్మకుండా, పోలీసులకు, అధికారులకు సహకరించాలి” అని పిలుపునిచ్చారు.

# యూరియా సరఫరాలో కేంద్రం విఫలమైందని మల్లెపల్లి జగన్ విమర్శ



**కల్వకుర్తి, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో జరిగిన సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెపల్లి జగన్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రానికి అవసరమైన యూరియా సరఫరా చేయడంలో కేంద్రం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు.రాష్ట్ర మంత్రులు, ఎంపీలు పలుమార్లు కేంద్రానికి నివేదించినప్పటికీ స్పందన లేకుండా వ్యవహరించడం రైతులపై చిత్తశుద్ధికి విరుద్ధమని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి ధర్నాలు, రాస్తారోకాలు చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, అలాంటి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదన్నారు. కేంద్రం ఇదే ధోరణిలో కొనసాగితే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# పర్యావరణ హితంగా మట్టి గణపతికి సప్తనది జల నిమజ్జనం



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని రాక్ విన్ కాలనీలో గణేశ చతుర్థి సందర్భంగా మట్టి గణపతికి సప్తనది జలాలతో నిమజ్జనం నిర్వహించారు. సనాతన ధర్మ సాంప్రదాయాలను పాటిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఈ వినూత్న కార్యక్రమాన్ని భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు ఏబీవీఎన్ రెడ్డి, కేవీయన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగ, యమునా, సరస్వతి, నర్మదా, సింధూ, కృష్ణా, గోదావరి జలాలతో అభిషేకించిన అనంతరం మట్టి గణపతిని నిమజ్జనం చేశారు. నిమజ్జన అనంతరం గణపతి మృత్తికను భక్తులకు పంపిణీ చేసి, తులసి కోటలు, పెరటి మొక్కలు, పంట పొలాల్లో చల్లుకోవాలని సూచించారు.పూర్వ కాలంలో చెరువుల మట్టితో తయారైన గణపతులను నిమజ్జనం చేయడం వల్ల నీటిలో కలిసిన మట్టి పంటలకు ఎరువులా పనిచేసేదని, ప్రస్తుతం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల జల కాలుష్యం పెరిగి జీవవైవిధ్యానికి ముప్పు ఏర్పడుతోందని నిర్వాహకులు తెలిపారు. మట్టి వినాయకుని నిమజ్జనంతో వాయు, జల కాలుష్య నివారణ సాధ్యమవుతుందని, మృత్తికా స్నానం ద్వారా ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఈ విధానాన్ని మరింతగా ప్రోత్సహించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# శివపల్లిలో గణనాధుని దర్శించిన ఎమ్మెల్యే విజయ రమణారావు



**ఎలిగేడు, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఎలిగేడు మండలంలోని శివపల్లి గ్రామంలో కొలువైన గణనాధుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే విజయ రమణారావు, ప్రజల సుఖసంతోషాలు, రైతుల పంటల సకాలంలో పండుదల కోసం ప్రార్థనలు చేశారు. తన సొంత గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన భక్తిశ్రద్ధలతో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుగ్యాల సంతోష్ రావు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# జ్యోతి హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**గూడూరు, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** గూడూరులోని జ్యోతి ఎలిమెంటరీ, జ్యోతి హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటిసి ఎల్.వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ ఎస్.ఎ.జిలాని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఎ.జిలాని, ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సమాజంలోని అన్ని ఉద్యోగులను తయారు చేసేది ఉపాధ్యాయులేనని, గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలని అన్నారు. అనంతరం, పాఠశాలలోని ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ రమేష్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఆచార్యురాలిగా డాక్టర్ కోడూరి శ్రీవాణికి ప్రశంసా పత్రం ప్రధానం







**ఎలిగేడు, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఎలిగేడు మండలానికి చెందిన శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కోడూరి శ్రీవాణి 2025 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర ఉత్తమ ఆచార్యురాలిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక, శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును స్వీకరించారు.తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీమతి శ్రీ యోగితారాన ఐఏఎస్, శాసనమండలి సభ్యులు పి. శ్రీపాల్ రెడ్డి, శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ చేతుల మీదుగా శ్రీవాణికి అవార్డు ప్రదానం జరిగింది.ఈ సందర్భంగా ఆమె విశ్వవిద్యాలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, రిజిస్టర్ ప్రొఫెసర్ రవికుమార్ శాస్త్రి, ఇతర అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# గణనాథునికి ఘన వీడ్కోలు

### శోభాయాత్రతో గంగమ్మ ఒడిలో నిమజ్జనం





**ఎలిగేడు, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినాయక చవితి సందర్భంగా మండలంలోని 12 గ్రామాల్లో కొలువైన గణనాథునికి తొమ్మిది రోజులపాటు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మహా నైవేద్యాలతో, వేద మంత్రోచ్ఛారణలతో గణపతిని ఆరాధించిన భక్తులు, శోభాయాత్రలతో గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు.మండల కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగింది. లడ్డూ వేలంపాటలు హోరాహోరీగా జరిగాయి. అనంతరం ప్రత్యేక వాహనాల్లో విఘ్నేశ్వరుడి విగ్రహాలను అలంకరించి, డీజే పాటలు, మేళతాళాలతో యువతీ యువకులు "గణేష్ మహారాజ్ కీ జై" నినాదాలతో సందడి చేశారు. నిమజ్జన వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తుల ఉత్సాహం, భద్రతా చర్యలు కలిసి ఈ నిమజ్జనోత్సవాన్ని శాంతియుతంగా, ఆధ్యాత్మికంగా ముగింపునకు చేర్చాయి.

# రేషన్ డీలర్ల సమ్మె విజయవంతం



**ఎలిగేడు, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఎలిగేడు మండలంలో శుక్రవారం నిర్వహించిన ఒకరోజు సమ్మె విజయవంతంగా జరిగిందని డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు సుంకనపల్లి రాజయ్య, జిల్లా నాయకులు వేల్పూరి అశోక్ రావులు తెలిపారు. రోజు రోజుకి రేషన్ దుకాణాల అద్దెలు, కరెంటు బిల్లులు, ఇంటర్నెట్, హమాలీ చార్జీలు,గుమస్తాల చార్జీలు పెరిగిపోతూ డీలర్లకు పెనుబారంగా మారుతున్నాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు డీలర్లకు కనీస గౌరవ వేతనం రూ. 5000 కమిషన్ పెంపు వంటి హామీలను ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు దాటిన ఇప్పటివరకు డీలర్ల సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. వెంటనే కనీస గౌరవ వేతనం పెంచి కమిషన్ పెంచాలని, కేంద్ర ప్రభుత్వం ఐదు నెలల కమిషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం నాయకులు శంకర్ ,ఐట్ల రమాదేవి శ్రీనివాస్, పుల్యాల సరిత రవీందర్ రెడ్డి ,సువర్ణ ,రాజమ్మ తిరుపతి తదితరులు సమ్మెలో పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి జితిన్ ప్రసాదతో తెలంగాణ బీజేపీ నేతల భేటీ..



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )** జీఎస్టీ, గ్రీన్ ఎనర్జీ గ్రాంట్లపై చర్చ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన బీజేపీ నేతల బృందం శుక్రవారం న్యూఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాదతో సమావేశమైంది. ఈ బృందంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యాలయ కార్యదర్శి దీపిక, బీజేపీ నాయకులు కొత్తకుర్మ శివ కుమార్ ఉన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలను నాయకులు ప్రశంసించారు. పౌరులపై ఆర్థిక భారాన్ని తగ్గించడంలో ఇవి సానుకూల ప్రభావం చూపాయని వారు పేర్కొన్నారు. అలాగే, తెలంగాణలోని షెడ్యూల్డ్ కులాల వారికి ప్లాస్టిక్ రీసైక్లింగ్ మరియు గ్రీన్ ఎనర్జీ పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రత్యేక గ్రాంట్లు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ సుస్థిరత, సామాజిక సాధికారత అనే రెండు లక్ష్యాలను దీని ద్వారా సాధించవచ్చని వారు నొక్కిచెప్పారు.

# జీఎస్టీ తగ్గింపుపై మోదీకి పాలాభిషేకం

### సంగారెడ్డిలో బీజేపీ సంబరాలు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీఎస్టీ ధరలు తగ్గించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతగా సంగారెడ్డి బీజేపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "నిత్యావసర వస్తువులపై పన్ను భారాన్ని తగ్గించి, పేద, మధ్యతరగతి ప్రజలకు దీపావళి కానుక అందించిన మోదీ గారి నిర్ణయం చారిత్రాత్మకమైనది. దీనివల్ల దేశం నష్టపోతోందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్న వాదన సిగ్గుమాలినది" అని విమర్శించారు. ప్రెస్ మీట్‌లో జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, రామకృష్ణ రాజు, రాథోడ్ తదితరులు పాల్గొని మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రం ముందుకు సాగుతోందని వారు అభిప్రాయపడ్డారు.

# గణేష్ నిమజ్జనోత్సవాలపై సమీక్ష

### – సమన్వయంతో పనిచేయాలని సూచించిన కమీషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజురాబాద్ డివిజన్‌లో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, అవాంఛనీయ ఘటనలేమి లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ సూచించారు. హుజురాబాద్ ఏసీపీ కార్యాలయంలో పోలీస్, విద్యుత్, వైద్య, మున్సిపల్, ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.నిమజ్జన ప్రదేశాల్లో బారికేడ్లు, సరైన లైటింగ్, క్రేన్లు, అదనపు డ్రైవర్లు సిద్ధంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, మొబైల్ బైక్‌లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా వైద్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం కాకతీయ కాలువ, జమ్మికుంట నాయిని చెరువు నిమజ్జన ప్రదేశాలను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సమీక్ష సమావేశంలో హుజురాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జి, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, వెంకట్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడు హరినాథ్ రెడ్డికి ఘన సన్మానం

**ప్యాపిలి సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రకటించే ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల జాబితా లో భాగంగా ప్యాపిలి పట్టణం కిందిగేరి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు హరినాథ్ రెడ్డికి ఆ గౌరవం దక్కింది. శుక్రవారం గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో న్యాయ శాఖామంత్రి ఎన్ఎండి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి గనియ చేతుల మీదుగా సన్మానం అనంతరం అవార్డును స్వీకరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు గ్రహీత హరినాథరెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు నాపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మోదీ గిఫ్ట్

### –బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి



**సిరిసిల్ల, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిరిసిల్ల పట్టణ కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. తాజాగా తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం పేద, రైతు, మధ్యతరగతి ప్రజలకు నేరుగా లాభం చేకూర్చనుంది" అని పేర్కొన్నారు.దినసరి అవసరాల వస్తువులు, గృహ వినియోగ వస్తువులపై ధరలు తగ్గడం వల్ల జీవన వ్యయం గణనీయంగా తగ్గుతుందని, పండుగల సమయంలో ఇది పేద కుటుంబాలకు నిజమైన బహుమతిగా నిలుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పెరిగిన ధరలు, పన్నుల భారం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న సామాన్య ప్రజలకు మోదీ ప్రభుత్వం ఊరట కలిగించిందని అభిప్రాయపడ్డారు."జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపు కేవలం ఆర్థిక ఉపశమనం మాత్రమే కాదు, పేదల అభ్యున్నతిపై మోదీ ప్రభుత్వ నిబద్ధతకు నిలువుటద్దం" అని గోపి పేర్కొన్నారు. దసరా–బతుకమ్మ పండుగకు ముందే ఈ నిర్ణయం పేదలకు మోదీ గిఫ్ట్‌గా మారిందని ఆయన అన్నారు.

# గణనాథునికి ఘన వీడ్కోలు

### –గణేష్ మండపాలను సందర్శించిన మాజీ మేయర్ సునీల్ రావు



**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినాయక చవితి ముగింపు సందర్భంగా కరీంనగర్ మాజీ మేయర్, బీజేపీ నాయకుడు యాదగిరి సునీల్ రావు 33, 53వ డివిజన్‌ల పరిధిలోని పలు గణేష్ మండపాలను సందర్శించారు. భగత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుని వద్ద చివరి పూజలు నిర్వహించి, హుండీ వేలంలో పాల్గొన్నారు.చైతన్య యూత్ క్లబ్, ఆదర్శ యూత్ క్లబ్, మైసమ్మ దేవాలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జనానికి తరలించారు. తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న కలశాన్ని స్వీకరించిన అనంతరం, అర్చకులు వై. సునీల్ రావుకు ఆశీర్వచనం అందించారు.ఈ కార్యక్రమాల్లో మండపాల నిర్వాహకులు, కాలనీవాసులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. నగరంలోని గణేష్ మండపాల్లో భక్తి, ఉత్సాహం, సంప్రదాయం సమ్మిళితంగా సాగిన ఈ నిమజ్జనోత్సవం విశేషంగా ఆకట్టుకుంది.


## గణేష్ నిమజ్జనోత్సవాలను పర్యవేక్షించిన కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనోత్సవాలు శాంతియుతంగా, సమన్వయంతో సాగేందుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్వయంగా పర్యవేక్షించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి శుక్రవారం రాత్రి కొత్తపల్లి, మానకొండూర్ చెరువులు, చింతకుంట కెనాల్ ప్రాంతాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.నిమజ్జన ప్రాంతాల్లో విగ్రహాల నిమజ్జనాన్ని క్రేన్ సహాయంతో స్వయంగా పర్యవేక్షించిన కలెక్టర్, కొన్ని విగ్రహాలను స్వయంగా నిమజ్జనం చేశారు. రెవిన్యూ, పోలీస్, మునిసిపల్, వైద్య, అగ్నిమాపక, గజ ఈతగాళ్ల బృందాలు షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అర్ధరాత్రి తర్వాత అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.టవర్ సర్కిల్ వద్ద నిర్వహించిన గణేష్ నిమజ్జన పూజా కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సిపి గౌస్ ఆలం, మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు. ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ నిమజ్జనోత్సవాలను విజయవంతంగా నిర్వహించారు.

# జీఎస్టీ తగ్గింపుపై మోదీకి పాలాభిషేకం

-గంభీరావుపేట బీజేపీ నేతల కృతజ్ఞతలు



**గంభీరావుపేట, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీఎస్టీ స్లాబ్ రేట్లు తగ్గించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతగా గంభీరావుపేట మండల కేంద్రంలో బీజేపీ నేతలు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గింపు సామాన్య ప్రజలకు ఊరట కలిగించడమే కాక, రైతులు, ఎంఎస్‌ఎంఈలు, మధ్యతరగతి, మహిళలు, యువతకు లాభం చేకూర్చేలా కేంద్రం సంస్కరణలు చేపట్టింది. జీఎస్టీ కౌన్సిల్ ఏకాభిప్రాయానికి రావడం గర్వకారణం" అని కోడె రమేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు రాజు గౌడ్, దేవేందర్ గౌడ్, డాక్టర్ సత్యనారాయణ, శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జమున, తదితర మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఘనంగా గురుపూజోత్సవం





**వరంగల్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ రాష్ట్రపతి స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని, జిల్లావిద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేటి బాలలే రేపటి పౌరులు. వారి భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే. ప్రతి వ్యక్తి ఎదుగుదల వెనుక ఓ గురువు కృషి తప్పనిసరిగా ఉంటుంది. దారితప్పిన విద్యార్థిని సన్మార్గంలో నడిపించే హక్కు సమాజంలో ఉపాధ్యాయునికే ఉంది" అని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మేయర్ గుండు సుధారాణి, జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డిఆర్‌ఓ విజయలక్ష్మి, కార్పొరేటర్ పల్లం పద్మ, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రామగుండంలో గణనాథుని దర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

అన్నదానంలో పాల్గొన్న నేతలు



**రామగుండం, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినాయక చవితి సందర్భంగా రామగుండం పట్టణంలోని పలు గణేష్ మండపాలను శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సందర్శించారు. కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, భక్తులతో కలిసి గణనాథుని సేవలో పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీనగర్‌లో నిర్వహించిన నిమజ్జన శోభాయాత్రలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని గణపతిని ఘనంగా సాగనంపారు. పూజా కార్యక్రమాల అనంతరం జరిగిన అన్నదానంలో స్వయంగా వడ్డించి భక్తులకు సేవలందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొని ఉత్సవాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు. రామగుండం ప్రజలతో మమేకమై, ఆధ్యాత్మికతకు ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొన్న ఈ కార్యక్రమం భక్తుల హృదయాలను తాకింది.

# ఘనంగా మిలాద్-ఉన్-నబి వేడుకలు

**డోన్ సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పట్టణంలోని ముస్లిం సోదరులు మిలాద్-ఉన్-నబి సందర్భంగా శుక్రవారం (జుమ్మా) నమాజ్ అనంతరం పాత బస్టాండ్ సమైక్యాంధ్ర కట్ట వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు దస్తగిరి, జహీర్ లు మాట్లాడుతూ సెప్టెంబర్ 5 తారీకున మహమ్మద్ ప్రవక్త జన్మించిన రోజు, అందుకు ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ జరుపుకుంటారు. ఈ దినమున ముస్లిం సోదరీ, సోదరులు నమాజ్, కురాన్ చదివి మహమ్మద్ ప్రవక్త పేరు మీద దరువు పంపుతారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లిం సోదరులు, భారీగా పాల్గొని విజయవంతం చేశారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపనతో పాటు వేగవంతమైన ప్రారంభం

## మదర్ థెరిసా సేవా స్ఫూర్తికి నివాళి



**వరంగల్ పశ్చిమ, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "ప్రతి కాలనీలో రోడ్డు నిర్మాణాలు పూర్తి చేస్తా. శంకుస్థాపనలకు, ప్రారంభోత్సవాలకు మధ్య కాల పరిమితి ఉండదు. అందరి సహకారంతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేస్తాం" అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కాజీపేటలోని అంబేద్కర్ కాలనీలో ?90 లక్షల వ్యయంతో 61వ, 62వ, 63వ డివిజన్లకు సంబంధించిన అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలల కాలంలో వరంగల్ పశ్చిమలో వర్షాకాలంలో నీట మునిగే ప్రమాదం నుంచి అనేక ప్రాంతాలను రక్షించగలిగాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి" అని తెలిపారు. గత పాలకుల కాలంలో నిర్లక్ష్యం పాలితమైన కాలనీలను కూడా అభివృద్ధి పథంలోకి తీసుకురాగలిగామని పేర్కొన్నారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే, సేవా భావానికి మారుపేరుగా నిలిచిన మదర్ థెరిసా వర్ధంతి సందర్భంగా ఫాతిమా నగర్ కూడలిలో ఆమె విగ్రహానికి నివాళులు అర్పించారు. "ప్రేమ, దయ, నిస్వార్థ సేవ అంటే ఏమిటో తన జీవితంతో చూపించిన మదర్ థెరిసా నేటి తరానికి స్ఫూర్తిదాయకం. ఆమె సేవా దృక్పథం ప్రతి ఒక్కరికీ మార్గదర్శిగా నిలవాలి. యువతలో సేవా భావం పెంపొందించేందుకు ఆమె జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉంది" అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో రమాకాంత్ సాగరిక, డివిజన్ అధ్యక్షులు రమేష్, వరంగల్ డయాసిస్ పాలనాధికారి ఫాదర్ విజయపాల్, ఫాదర్ కాసు మరెడ్డి, బొక్కా దయాసాగర్, రాజ్ మోహన్ రావు, కూరపాటి వెంకట నారాయణ, సిద్ధిఖీ, తిరునహరి శేషు తదితరులు పాల్గొన్నారు.


# పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

## జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జై



**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నూతనంగా పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులకు ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి చైతన్య జై మాట్లాడుతూ, "పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే అరుదైన అవకాశం మీకు లభించింది. ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా మీరు చేసే ప్రతి చర్య విద్యార్థుల జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. విద్యాశాఖలోని ఇతర అధికారులు పరోక్షంగా సేవలందిస్తే, ప్రధానోపాధ్యాయులు మాత్రం ప్రత్యక్షంగా విద్యార్థులతో మమేకమై మార్గనిర్దేశం చేసే అవకాశం పొందుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ బాధ్యతను స్ఫూర్తిగా తీసుకొని విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు నలుమాసు సుదర్శనం మాట్లాడుతూ, "సంఘం ద్వారా ప్రధానోపాధ్యాయులకు అవసరమైన అన్ని రకాల సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నాం. త్వరలో ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించనున్నాం" అని తెలిపారు. జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన భగవంతయ్య మాట్లాడుతూ, "కమిట్మెంట్తో పని చేసినప్పుడు విజయాలు సాధించగలుగుతాం. సేవా దృక్పథంతో ముందుకు సాగాలి" అని నూతన ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ కోఆర్డినేటర్లు కర్ర అశోక్ రెడ్డి, ఆంజనేయులు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాపల్లి శ్రీనివాస్, కోశాధికారి అనురాధ, రాష్ట్ర -జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు, మండల విద్యాధికారులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పదోన్నతి పొందిన 86 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యా వాతావరణంలో స్ఫూర్తిదాయకంగా సాగింది.

# గణపయ్య ఆశీస్సులతో ప్రజలకు శాంతి సుఖాలు కలగాలి: ఎమ్మెల్యే గండ్ర



**భూపాలపల్లి, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విఘ్నాలను తొలగించే ఆది దేవుడు గణపయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆకాంక్షించారు. గణపతి నవరాత్రి సందర్భంగా మంజూరునగర్‌లోని పాత కలెక్టరేట్ ప్రాంగణంలో లలితా త్రిపుర సుందరి దేవి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, డీఎస్పీ సంపత్ రావుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం లలితా త్రిపుర సుందరి దేవిని దర్శించిన ఎమ్మెల్యే, తీర్థప్రసాదాలు స్వీకరించారు. "ఐక్యత, భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలి" అని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మహబూబ్‌పల్లి ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా కొమ్ము ప్రమీలకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాలిపోయిన బియ్యం, దుస్తులు, టీవీ తదితర సామాగ్రిని పరిశీలించి, "అధైర్యపడొద్దు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటాం" అని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయం అందించేందుకు సంబంధిత శాఖల అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించిన ఎమ్మెల్యే, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంఘటన స్థలంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు తోడుగా ఉన్నారు.

# గ్రామ పాలనాధికారుల నియామక ఉత్తర్వుల పంపిణీకి మంచిర్యాల నుండి అధికారుల తరలింపు



**మంచిర్యాల, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలనాధికారుల నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా నుండి అధికారులు హైదరాబాద్ తరలివెళ్లారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి మూడు ప్రత్యేక బస్సులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆధ్వర్యంలో జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల తహసిల్దారులు దిలీప్ కుమార్, శ్రీనివాసరావు దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా హైటెక్ సిటీలో నిర్వహించనున్న కార్యక్రమంలో గ్రామ పాలనాధికారులకు నియామక ఉత్తర్వులు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోస్టింగ్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించబడుతుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లా నుండి మొత్తం 124 మంది గ్రామ పాలనాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు తరలించబడ్డారు. ప్రతి బస్సులో ఒక ఉపతహసిల్దార్, ఒక పోలీస్ కానిస్టేబుల్ ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు, భోజన సౌకర్యం కూడా కల్పించబడిందని కలెక్టర్ వివరించారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ శాతవాహన ఆధ్వర్యంలో సన్మానం




**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ శాతవాహన, కరీంనగర్ వారు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు ఉపాధ్యాయులు సింగం రాజు, పుల్లరి ప్రభాకర్‌లకు ఘనంగా సన్మానం చేశారు. వారి సేవలను గుర్తించి, శాలువా కప్పి, స్మృతిచిహ్నాలు అందజేశారు.
క్లబ్ సభ్యులు, విద్యాభిమానులు పాల్గొన్న ఈ కార్యక్రమం సాంస్కృతికంగా, స్ఫూర్తిదాయకంగా సాగింది.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భాగ్యనగర్‌లోని మాంటిసోరి పాఠశాలలో రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కోరికల పాఠశాల, గంగాధర్, బోయిన్పల్లి, ముత్తునూరు, హిందూపూర్ తదితర ప్రాంతాల నుండి ఎంపికైన ఉపాధ్యాయులకు శాలువాలు, మెమెంటోలు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు క్లబ్ సభ్యులు, విద్యాభిమానులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో పూజలు, అన్నదానంలో పాల్గొన్న వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు శుక్రవారం కాపువాడతో పాటు పలు వినాయక మండపాలను సందర్శించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు మండపాల నిర్వాహకులు, కాలనీవాసులు ఘన స్వాగతం పలికారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కాపువాడలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన రాజేందర్ రావు స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. "తొమ్మిది రోజులపాటు కరీంనగర్లో వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి" అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గురువుల దీవెనలు తీసుకున్న పూర్వ విద్యార్థులు:



**గూడూరు సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గూడూరు జిల్లా పరిషత్ హై స్కూల్ 1984 మరియు 85వ 10వ తరగతి పూర్వ విద్యార్థులు నేడు గురుపూజోత్సవ సందర్భంగా కర్నూల్ లో ఉన్న తమ గురువులైన బి వెంకటేశ్వర్లు సోషల్ మాస్టర్ గారిని వారి దంపతులను శాల్వా పూలమాలతో సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది

## వినాయక నిమజ్జనంలో పాల్గొన్న కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వర్



**కమాన్‌పూర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గుండారం గ్రామపంచాయితీలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్, పానీయాలు, వైద్య శిబిరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అన్వర్ మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ శాంతి, సౌభ్రాతృత్వ వాతావరణంలో పాల్గొని పండుగను విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, మాజీ సర్పంచ్ బొల్లపల్లి శంకర్ గౌడ్, సయ్యద్ ఇక్బాల్, అబ్దుల్ రఫీక్, కిషన్ రెడ్డి, ముస్తాక్, తదితరులు పాల్గొన్నారు.

## ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్




**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లో జరగబోయే ఎక్స్‌పోలో దేశవ్యాప్తంగా ఉన్న టెక్నాలజీ కంపెనీలు నూతన పరికరాలు, సాఫ్ట్‌వేర్లు, శిక్షణ కార్యక్రమాలు ప్రదర్శించనున్నాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఫోటోగ్రఫీ రంగం టెక్నాలజీతో వేగంగా అభివృద్ధి చెందుతోందని, అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవీందర్, జిల్లా అధ్యక్షుడు తుమ్మ చందు, కోశాధికారి బొంగోని మధుసూదన్, జాయింట్ సెక్రటరీ ఎండి కాజా, నిషాని శంకర్, బైరి శేఖర్, సాగర్ రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జనంలో ట్రాక్టర్ నడిపిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గణేశ్ నిమజ్జనోత్సవాల సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మహాశక్తి ఆలయంలో గణేశ్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి గణేశ్ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ప్రతిష్ఠించి స్వయంగా కొద్ది దూరం ట్రాక్టర్ నడిపారు. ఈ సందర్భంగా నగరంలో గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం బండి సంజయ్ టవర్ సర్కిల్ వద్దకు చేరుకుని రాత్రి వరకు నిమజ్జనోత్సవాల్లో పాల్గొననున్నారు.

## గణేశనగర్ వినాయక మండపాన్ని దర్శించిన నాగసాదువులు



**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హిమాలయ పర్వత శ్రేణుల్లో తపస్సు చేస్తున్న నాగసాదువులు శుక్రవారం ఉదయం కరీంనగర్ గణేశనగర్‌లోని జనసేన యూత్ ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామేశ్వరం ప్రయాణంలో భాగంగా వివిధ క్షేత్రాలు దర్శిస్తున్న వీరు, మార్గమధ్యంలో గణేశనగర్ మండపాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పల అనసూయ-రామేశం దంపతులు నాగసాదువులను తమ గృహానికి ఆహ్వానించి అల్పాహారం, దక్షిణ సమర్పించి ఆశీర్వాదం పొందారు. భక్తి, ఆత్మీయతతో సాగిన ఈ సంఘటన స్థానికంగా విశేషంగా ఆకట్టుకుంది.

# జీఎస్టీ తగ్గింపుపై బీజేపీ శ్రేణుల సంబరాలు

### మోదీకి పాలాభిషేకం

**హుజురాబాద్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జీఎస్టీ పన్నుల భారం తగ్గించినందుకు కేంద్ర ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతగా బీజేపీ శ్రేణులు జిల్లావ్యాప్తంగా చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. హుజురాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పేద, రైతు, మధ్యతరగతి ప్రజలకు నేరుగా లాభం చేకూరేలా జీఎస్టీ స్లాబ్‌లు తగ్గించబడ్డాయి. నూనె, సబ్బు, షాంపూ, బేబీ డైపర్స్ వంటి నిత్యావసర వస్తువులపై పన్ను 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం శుభ పరిణామం.



సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్న ఈ నిర్ణయం పండుగల సమయంలో ప్రజలకు నిజమైన బహుమతిగా మారనుంది" అని తెలిపారు. ఆరోగ్య రంగం, విద్య, వ్యవసాయం, ఎంఎస్ఎంఈలకు గణనీయమైన ఉపశమనం లభించనుందని, హెల్త్, లైఫ్ ఇన్స్యూరెన్స్‌పై జీఎస్టీ పూర్తిగా మినహాయించబడిందని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్సిల్స్, మ్యాప్స్ వంటి వస్తువులపై పన్ను మినహాయింపు లభించిందని తెలిపారు. రైతులకు అవసరమైన యంత్రాలు, విత్తన పరికరాలపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించబడిందని వివరించారు. మధ్యతరగతి ప్రజలకు వాహనాలు, ఎలక్ట్రానిక్స్, గృహ వినియోగ వస్తువులు మరింత చౌకగా లభించనున్నాయని, మోదీ పాలనలో ధరల భారం తగ్గి అభివృద్ధి పథంలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పెరిగిన పన్నుల భారం, ధరల పెరుగుదల సామాన్యుడిని ఇబ్బందుల్లోకి నెట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారమిత వరల్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీకర్‌కు గురుబ్రహ్మ అవార్డు



**కరీంనగర్, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అల్గునూరులోని పారమిత వరల్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీకర్ మొహరిర్‌కు ప్రతిష్టాత్మక గురుబ్రహ్మ అవార్డు లభించింది. ఎస్ఆర్ఎఫ్ నిర్వహించిన ఒలంపియాడ్ టెస్ట్‌లో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన అవార్డు మహోత్సవంలో ప్రముఖ సామాజికవేత్త డా. జయప్రకాశ్ నారాయణ చేతుల మీదుగా శ్రీకర్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తన కృషిని గుర్తించి ఈ అవార్డు లభించడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఈ ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, వి.యు.యం ప్రసాద్, రష్మిత, టి.యస్.వి రమణ, రాకేష్, హన్మంతరావు తదితరులు శ్రీకర్‌ను అభినందించారు.

## స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు


### రక్తదానం, అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలో స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమర్ నగర్ చౌరస్తాలోని విగ్రహానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఉపాధ్యాయులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సిరి ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి రెసిడెన్షియల్ టీచర్స్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేసి, రాధాకృష్ణ గారి విద్యా తత్వాన్ని వివరించిన ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగానికి అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. అదే రోజు మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఎం.బి గార్డెన్స్‌లో తలసేమియా పిల్లల కోసం ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే, రక్తదాతలను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.తదుపరి దారుల్ ఖైర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషంట్స్ కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, సేవా దృక్పథాన్ని ప్రతిబింబించారు.ఈ కార్యక్రమాల్లో ముస్లిం మత పెద్దలు, మైనారిటీ సోదరులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సమాజ సేవకులు పాల్గొన్నారు.

# గుండె జబ్బులతోనే దేశంలో 30% మరణాలు..

### తాజా అధ్యయనం వెల్లడి



**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు హృదయ సంబంధ వ్యాధుల కారణంగా మరణిస్తున్నారని, మొత్తం 30 మరణాల్లో 30 శాతం దీని కారణంగానే సంభవిస్తున్నాయని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇందులో గుండెపోటు, స్ట్రోక్స్ వంటివి ఉన్నాయి. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిపిన శాంపుల్ రిజిస్ట్రేషన్ సర్వే వివరాల నివేదికను 'మరణానికి కారణాలు' పేరుతో విడుదల చేశారు.దేశంలో 2021–23 మధ్య అసంక్రమిత వ్యాధుల కారణంగా 56.7 శాతం మంది మరణించారని ఈ నివేదిక తెలిపింది. అలాగే సాంక్రమిక, ప్రసూతి, ప్రసవానంతర, ఆహార లోపం తదితర కారణాలతో 23.4 శాతం మంది కన్నుమూశారు.


# ఈవీకి వైర్‌లెస్ చార్జింగ్.. జర్మనీ కంపెనీ పోర్షే వెల్లడి




**న్యూఢిల్లీ సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలక్ట్రిక్ వాహనాలకు వైర్‌లెస్ చార్జింగ్ టెక్నాలజీని జర్మనీ కంపెనీ పోర్షే అభివృద్ధి చేసింది. భౌతికంగా ఓ కేబుల్ కనెక్షన్ అవసరం లేకుండానే ఛార్జింగ్ చేయవచ్చునని తెలిపింది. 2026లో విడుదలయ్యే కేయెన్నే ఎలక్ట్రిక్ వాహనాలకు ఈ టెక్నాలజీతో ఛార్జింగ్ పెట్టుకోవచ్చునని పేర్కొంది.తాము తయారు చేసిన ఛార్జింగ్ ప్యాడ్‌పైన కారును పార్క్ చేస్తే, ఛార్జింగ్ అవుతుందని వివరించింది. ఈ సిస్టమ్‌ను మ్యూనిచ్‌లో జరిగే ఐఏఏ మొబిలిటీ షోలో ప్రదర్శించనున్నట్లు తెలిపింది.

# అమెరికాలో విస్తరిస్తున్న కిస్సింగ్ బగ్స్

### ఇవి ప్రాణాంతక చాగస్ వ్యాధి కారకాలు



**వాషింగ్టన్: సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమెరికాలో 'కిస్సింగ్ బగ్స్' విస్తరిస్తున్నాయి. ఇవి నిద్రపోతున్న మనుషుల ముఖాలపై కుట్టి, ఆ గాయం పరిసరాల్లో ప్రమాదకరమైన పరాన్నజీవులను విడుదల చేస్తాయి. ఫలితంగా చాగస్ వ్యాధి సోకుతుంది. దీనిని సత్వరమే గుర్తించి, చికిత్స చేయకపోతే, నెమ్మదిగా గుండె, జీర్ణ వ్యవస్థలు దెబ్బతింటాయి.చివరికి ప్రాణాంతక పర్యవసానాలకు దారి తీయవచ్చు. అమెరికాలోని కాలిఫోర్నియా, టెక్సాస్, ఫ్లోరిడా సహా 32 రాష్ట్రాల్లో ఈ వ్యాధి సోకినవారు ఉన్నట్లు అంచనా.

# సుప్రీంను ఆశ్రయిస్తాం

### ఉమర్ ఖలీద్‌కు బెయిల్ నిరాకరణపై కపిల్ సిబల్



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించిన నేపథ్యంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ ఈ అన్యాయానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. రాజకీయంగా తమకు హాని కలుగుతుందని భావించి, ఇలాంటి అంశాలను రాజకీయ పార్టీలు లేవనెత్తనపుడు, భారతదేశ ప్రజాస్వామ్యం ఎక్కడికి వెళుతోందని ఆయన ప్రశ్నించారు. ఖలీద్ తరఫు న్యాయవాది ఏడుసార్లు వాయిదాలు కోరారని మాజీ సీజేఐ డి.వై.చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఈ అంశం సుప్రీంకోర్టు ముందున్నపుడు కేవలం రెండుసార్లే వాయిదా కోరారని చెప్పారు. "ఏండ్ల తరబడి కోర్టు తీర్పు ఇవ్వకపోతే, అందుకు లాయర్లను నిందిస్తున్నారు. ఇది కోర్టుల్లోని పరిస్థితి. మీరు బెయిల్ ఇవ్వాలనుకోకపోతే వెంటనే తిరస్కరించండి, ఎందుకు 20, 30సార్లు విచారణలు జరుపుతారు?" అని సిబల్ ఇక్కడ ఒక పత్రికా సమావేశంలో ప్రశ్నించారు.

# అడ్డదిడ్డంగా కరెంటు తీగలు..







(మొదటి తరువాయి)

దహనమయ్యారు. ఈ ఘటన మరువక ముందే రామంతాపూర్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. రెండ్రోజుల కిందట నాచారంలో బైక్‌పై వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై విద్యుత్ స్తంభం విరిగి పడటంతో అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు. కొందరు విద్యుత్ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**– కుంగిపోతున్న స్తంభాలు**

గ్రేటర్ హైదరాబాద్‌లో 33/11 కేవీ సబ్ స్టేషన్లు 498 ఉండగా, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 1,022 ఉన్నాయి. 33 కేవీ యూజీ కేబుల్ లైన్లు 1,280 కిలోమీటర్లు విస్తరించి ఉండగా, 33 కేవీ ఓవర్ హెడ్ లైన్లు 3,725 కిలోమీ టర్లు, 11 కేవీ ఓవర్ హెడ్ లైన్లు 21,643 కిలోమీటర్లు, 11కేవీ యూజీ కేబుల్ లైన్లు 957 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 1,50,992 ఉండగా, వీటి పరిధిలో 63 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 11 కేవీ విద్యుత్ స్తంభం ఎత్తు 9 మీటర్లపైగా ఉండగా అదే 33 కేవీ స్తంభం 10 మీటర్లకుపైగా ఎత్తు ఉంటుంది. మెజార్టీ సర్వీసు ప్రొవైడర్లు ఐదారు మీటర్ల ఎత్తు నుంచే వైర్లను రోడ్డుకు అటు ఇటుగా ఉన్న ఇండ్లకు లాగుతున్నారు. లైన్ వేయగా మిగిలిన వైర్లను ఉండలుగా చుట్టి స్తంభాలకు వేలాడదీస్తున్నారు. ఇలా ఒక్కో స్తంభానికి కేజీల బరువు ఉన్న తీగలు వేలాడుతున్నాయి. సామర్థ్యానికి మించిన బరువును తట్టుకోలేక ఆయా స్తంభాలు ఏదో ఒక వైపు వంగిపోతున్నాయి.

**– ఏటా రూ.100 కోట్లు ఖర్చు**

నగరంలోని పాతబస్తీ సహా ప్రధాన బస్తీల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్ హెడ్ చైన్లు, ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. ఏండ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. తరచూ వైర్లు తెగిపడుతుండటంతో పాటు స్తంభాలను ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, లూజు వైర్లు సరిచేయడం, దెబ్బతిన్న పిన్ ఇన్సులేటర్లను మార్చడం, పాడైన ఫ్యూజ్ బాక్సులను మార్చడం, బీఆర్ వద్ద పటిష్టమైన ఎర్తింగ్ ఏర్పాటు చేయడం వంటి పనుల కోసం డిస్కం ఏటా రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. అయితే, నిధులు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి తప్ప సరఫరా వ్యవస్థ ఏమాత్రం మెరుగుపడటం లేదు. మరణాలు ఆగడం లేదు. మెట్రో జోన్ పరిధి పలు బస్తీల్లోని ఇరుకు గల్లీల్లో ప్రమాదకరంగా మారిన కండక్టర్ల స్థానంలో ఎయిర్ బంచ్డ్ కేబుళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు 550 కిలో మీటర్లు గుర్తించి ఆగస్టు నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభించలేదు.

**– " వరుసగా జరిగిన సంఘటనలు ఇలా..**

– కేపీహెచ్‌బీ కాలనీలో షటిల్ ఆడుకుంటూ వెళ్లిన బాలుడు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్‌కు గురై ప్రాణం కోల్పోయాడు.

– సనత్‌నగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో విద్యుత్ షాక్‌తో ముగ్గురు మరణించారు.

– ఈ ఏడాది ఫిబ్రవరిలో షాహీన్‌నగర్‌లో 18 ఏండ్ల బాలిక విద్యుత్ షాక్‌తో చనిపోయింది.

– మే నెలలో ఎంఎస్ మక్తా గ్రౌండ్‌లో ఆటాడుకుంటూ విద్యుత్ స్తంభాన్ని తాకి 12 ఏండ్ల చిన్నారి మృతిచెందింది.

– కాటేదాన్ మధుబన్ సమీపంలో 5 నెలల కిందట నియంత్రిక తీగ తెగి డీసీఎంపై పడటంతో డ్రైవర్ మృతిచెందారు. రెండు ఆవులు, మూడు మేకలు మృత్యువాత పడ్డాయి.

– మూడేండ్ల కిందట పద్మారావునగర్‌లో కవర్ కండక్టర్ తెగిపడటంతో ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి ప్రాణం కోల్పోయాడు.

– దుండిగల్ మున్సిపాల్టీలో రెండేండ్ల కిందట మల్లంపేట ఆకాశ్ లేవుట్ సమీపంలో కరెంట్ తీగ తెగి రోడ్డుపై పడగా ఆ సమయంలో బైక్‌పై వెళుతున్న స్థానిక నివాసికి కరెంట్ షాక్ తగిలి మృతిచెందాడు.

– నాలుగేండ్ల కిందట జవహర్‌నగర్ అంబేద్కర్‌నగర్ నోబెల్ పాఠశాల వద్ద ఇంటిపై రేకులు వేస్తుండగా ఎల్ లైను తీగలు తగిలి ఓ వ్యక్తి అపస్మారక స్థితికి వెళ్లాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించేలోగా చనిపోయాడు.

– మల్కారం ప్రాంతంలో ఎనిమిదేండ్ల బాలుడు విద్యుత్ జంక్షన్ వద్ద తీగలు తగిలి విద్యుద్ఘాతంతో మృతిచెందాడు. ఇలా వెలుగు జూసినవి అధికారికంగానే ఇన్ని ఉంటే.. అనధికారికంగా మరెన్ని ప్రమాదాలు జరిగి ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

# టెక్ దిగ్గజాలకు ట్రంప్ 'విందు' బెదిరింపులు

**–అమెరికాలో మీ పెట్టుబడులు ఎంత? అంటూ నిలదీత**
**–శ్వేతసౌధంలో అధ్యక్షుడి విందుకు దిగ్గజాల హాజరు**
**–టెస్లా అధినేత ఎలన్ మస్క్‌కు అందని ఆహ్వానం**




**వాషింగ్టన్ సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమెరికాలో పెట్టుబడులే లక్ష్యంగా పలువురు టెక్ దిగ్గజాలకు ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విందు ఇచ్చారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ టెక్నాలజీ సంస్థల అధిపతులు, సిఇఓలు హాజరయ్యారు. అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ ఆధ్వర్యంలో జరిగిన ఏఐ ఈవెంట్ అనంతరం ఈ డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టిమ్‌కుక్, సుందర్ పిచారు, మార్క్ జుకర్‌బర్గ్, సత్యనాదెళ్ల వంటి పలువురు టెక్ దిగ్గజాలు హాజరయ్యారు. అయితే ట్రంప్ ఒకప్పటి మిత్రుడు, టెస్లా అధినేతకు మాత్రం ఆహ్వానం అందకపోవటం గమనార్హం. తనకు ఆహ్వానం అందిందనీ, తాను మాత్రం ఈ విందుకు హాజరు కాలేకపోయానని మస్క్ వివరణ ఇచ్చారు. విందుకు పిలిచినట్టే పిలిచి అస్సలు అమెరికాలో మీరు పెట్టిన పెట్టుబడులు ఎంత అంటూ టెక్ దిగ్గజాలను ట్రంప్ నిలదీశారు. ఇతర దేశాల్లో పెట్టిన పెట్టుబడులు ఇక చాలించాలని, స్వదేశానికి తిరిగి రావాలని ఆయన తనదైన శైలిలో బెదిరించినట్లు సమాచారం.

'టిమ్.. అమెరికాలో యాపిల్ ఎంత పెట్టుబడులు పెట్టనుంది. అది చాలా పెద్ద మొత్తమే అయి ఉంటుందని నాకు తెలుసు. ఇన్నాళ్లు మీరు బయట (ఇతర దేశాల్లో) పెట్టుబడులు పెట్టింది చాలు. ఇక స్వదేశానికి తిరిగిరండి. ఎంత పెట్టుబడి పెడతారు?" అని యాపిల్ సిఇఓ టిమ్ కుక్‌ను ట్రంప్ అడిగారు. దీనికి టిమ్ బదులిస్తూ.. '600 బిలియన్ డాలర్లు' అని చెప్పారు. భారత్‌లో యాపిల్ కార్యకలాపాలు నిలిపివేయాలంటూ గత కొంత కాలంగా ఆ సంస్థపై ట్రంప్ ఒత్తిడి చేస్తోన్న విషయం తెలిసిందే. అయితే భారత్‌ను టార్గెట్‌గా చేసుకొనే విదేశాల్లో పెట్టుబడులు ఆపేయాలని ట్రంప్.. టిమ్‌ను ప్రశ్నించినట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఇక ట్రంప్ అడిగిన ఇదే ప్రశ్నకు మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ బదులిస్తూ.. '600 బిలియన్ డాలర్లు' ఇన్వెస్ట్ చేయనున్నట్టు చెప్పారు. రాబోయే రెండేండ్లలో 250 బిలియన్ డాలర్లు అమెరికాలో పెట్టుబడులు పెట్టబోతున్నామని గూగుల్ సిఇఒ సుందర్ పిచారు తెలిపారు. ఏటా 80 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడతామని మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్యనాదెళ్ల బదులిచ్చారు. టెక్ దిగ్గజాల సమాధానాలకు ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడులు చాలా పెద్ద మొత్తమనీ, వీటితో పెద్ద ఎత్తున ఉద్యోగలు సృష్టించొచ్చని వారిని అమెరికా అధ్యక్షుడు అభినందించారు.

# ప్రధాని సౌదీ పర్యటన ఖర్చు ఆర్‌టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడి

### 12 గంటల కోసం రూ.15 కోట్ల ఖర్చు!



**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటన కోసం జరుగుతున్న ప్రజాధనం దుర్వినియోగంపై తాజా వివాదం రాజుకుంది. 'కేవలం 12 గంటల కోసం ప్రధాని మోదీ సౌదీ పర్యటనకు రూ. 15 కోట్లు ఖర్చు అయింది' అని సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడైంది. మహారాష్ట్రకు చెందిన సమాచార హక్కు(ఆర్‌టీఐ) కార్యకర్త అజయ్ బసుదేవ్ బోస్ అడిగిన ప్రశ్నకు జెడ్డాలోని భారత కాన్సులేట్ జనరల్ ఈ మేరకు సమాధానమిచ్చింది. గంటకు 1.25 కోట్ల చొప్పున ఖర్చు పెట్టారంటే గుండె మండుతోందని, కేవలం 12 గంటల కోసం మొత్తం హొటల్‌ని రూ. 10.2 కోట్లకు బుక్ చేశారని, ఇది దేశానికి భారీ నష్టమేనని కాంగ్రెస్ తన పోస్టులో పేర్కొంది.ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత ప్రధాని మోదీ తన సౌదీ అరేబియా పర్యటనను అర్థాంతరంగా ముగించుకున్నారు. ఇందుకు అయిన ఖర్చు రూ. 15.54 కోట్లు అని ఆర్‌టీఐ జవాబు పేర్కొంది. ఇందులో కేవలం హొటల్ బుకింగ్‌ల కోసమే రూ. 10.2 కోట్లు ఖర్చయింది. జెడ్డాలో కొన్ని గంటలు ఉన్నందుకు ఇంత భారీ స్థాయిలో ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేయడం అసాధారణమని ఆర్‌టీఐ కార్యకర్త బోస్ విలేకరుల వద్ద వ్యాఖ్యానించారు. హొటల్ బుకింగ్‌ల కోసం రూ.10 కోట్ల మేరకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయడం దిగ్భ్రాంతికరమని ఆయన చెప్పారు. ఈ ఆడంబరాలపై మోదీని ఎవరైనా ప్రశ్నించగలరా అని ఎక్స్‌లో ఆయన ప్రశ్నించారు.